ప్రజాశక్తి

శనివారం 5 ఏప్రిల్ 2025

8 పేజీలు





విశాఖపట్నం అనకాపల్లి

సీనియారిటీ.. ఏదీ క్లారిటీ !

◆ అభ్యంతరాల స్వీకరణకు ఈ నెల 10 వరకూ గడువు ◆ గతంలో రెండు పర్యాయాలు ఇదే తంతు

◆ అయినా మళ్లీ తప్పల తడకే అంటున్న ఉపాధ్యాయులు



ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జిటి)లను స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి కల్పించడం కోసం జిల్లా విద్యాశాఖ చేపడుతున్న సీనియారిటీ జాబితాల తయారీ తప్పల తడకగానూ, ప్రహసనంగానూ మారుతోంది. తాజాగా ఈ నెల 4 నుంచి 10 వరకూ అభ్యంతరాలపై రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టరు నుంచి వెలువడ్డ ఆదేశాలతో జిల్లా విద్యాశాఖ కార్యాలయం, మండల విద్యాశాఖ అప్రమత్తమయ్యాయి. ఈ క్రమంలో విద్యాశాఖ పరిధిలోగల అన్ని ప్రభుత్వ పాఠశాలల నుంచి సరైన సీనియారిటీ జాబితాలను సిద్ధం చేసుకోవాల్సి ఉంది. మండల విద్యాశాఖలు జాబితాల తయారీలో ఇప్పటికే నిమగ్నమయ్యాయి. అయితే గత రెండు దఫాలుగా స్వీకరించిన అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోకపోవడం, డిఇఒ కార్యాలయంలో సరైన జాబితాల్లేకపోవడంతో మళ్లీ సమస్య ఉత్పన్నమయ్యే అవకాశముందని ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నాయి.

సబ్జెక్టుల వారీగా జాబితా తయారీ

ఎస్‌జిటి టీచర్ల సీనియారిటీ జాబితాలను వాస్తవానికి ఇప్పటివరకూ జరిగిన డిఎస్‌సిల వారీగా జిల్లా విద్యా శాఖ కార్యాలయాలు తమ వద్ద ఉంచుకోవాల్సి ఉన్నా సరైన పద్ధతిలో ఆ ప్రక్రియ సాగలేదు. సబ్జెక్టుల వారీగా సీనియారిటీ జాబితాపై ఏ టీచరుకైనా అభ్యంతరాలు ఉంటే చినగదిలి మండలంలోగల విశాఖ వ్యాలీ స్కూల్ వద్దగల డిఇఒ కార్యాలయంలో తెలుపవచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ ప్రకటించారు. గతంలో రెండు సార్లు సీనియారిటీ లిస్టులను ఇచ్చినప్పటికీ అవేవీ ప్రతిబింబించలేదని, తప్పులు యధావిధిగా దొర్లాయని నేటికీ విమర్శలు వినిపిస్తున్నాయి. డిఇఒ కార్యాలయంలో ఒరిజినల్ జాబితాలు లేనందున ఈ సమస్య తలెత్తుతోంది.

ఏం జరగాలి ? ఏం జరుగుతోంది ?

డిఎస్‌సిల వారీగా జాబితాలు, టీచర్లుగా ఎంపికైన వారి పేర్లు, మార్కులు, రోస్టరు, ర్యాంకులు ఇలా అన్ని వివరాలతో కూడిన ఫైలు డిఇఒ కార్యాలయంలో కచ్చితంగా ఉండాలి. ఉదాహరణకు 1998లో 1000 మంది టీచర్లు జిల్లాలో సెలక్టు అయితే వారి జాబితా పై అన్నిటితో కలిపి ఉండాలి. కానీ 2001 సంవత్సరం తర్వాత ఈ సీనియారిటీ లిస్టుల్లో తీవ్ర గందరగోళం ఉన్నట్లు తెలుస్తోంది. అభ్యంతరాలను స్వీకరించినా డిఎస్‌సిల వారీగా టీచర్ల జాబితా మిగతా 2లో..

స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో..

నిర్వాసితులకు ద్రోహం చేయొద్దు

సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలోని నక్కపల్లి మండలంలో ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్‌ప్లాంట్‌కు, దానికి డిఎల్.పురం వద్ద క్యాప్టివ్ పోర్టుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలపడంపై సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. భూములు కోల్పోయిన వారికి పూర్తి పరిహారం చెల్లించకుండా, నిర్వాసిత కుటుంబాలకు ప్యాకేజీ, పునరావాసం కల్పించకుండా మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు అనుమతులివ్వడం నిర్వాసితులకు అన్యాయం చేయడమేనని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' పేరుతో కార్పొరేట్ సేవలో మునిగి తేలుతున్న కూటమి ప్రభుత్వానికి నిర్వాసితుల సమస్యలు పట్టడంలేదని తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఇనుప గనుల కేటాయింపు, సెయిల్‌లో విలీన సమస్యను పరిష్కరించకుండా ప్రయివేటు స్టీల్‌ప్లాంట్‌కు అన్ని సదుపాయాలూ కల్పించడం రాష్ట్ర ప్రజలను మోసగించడమే అవుతుందని పేర్కొన్నారు. రాంబిల్లి మండలం గోరపూడిలో ఫేజ్-2 కింద రూ.5 వేల కోట్ల విలువైన బల్క్‌డ్రగ్ పరిశ్రమలకు మిగతా 2లో..

బౌడారా రోడ్డులో తొలగింపులు

హైకోర్టు ఆదేశాలు బేఖాతరు : బాధితుల ఆవేదన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పూర్ణామార్కెట్ జంక్షన్, బౌడారా రోడ్డులోని ఒక భవనానికి అనుకుని ఉన్న మంచినీళ్ల ట్యాంక్, జ్యూస్ కౌంటర్, స్వీట్ బండి ట్రాఫిక్‌కు అంతరాయంగా ఉన్నాయంటూ శుక్రవారం జివిఎంసి అధికారులు తొలగించారు. ఈ క్రమంలో బాధితులు అడ్డుకోవడానికి ప్రయత్నించారు. గతంలోనే జివిఎంసి అధికారులు వీటిని తొలగించడానికి వచ్చారని, అప్పట్లో తాము హైకోర్టును ఆశ్రయించగా ఎటువంటి తొందరపాటు చర్యలూ తీసుకోవద్దని, యధాస్థితిని కొనసాగించాలని ఆదేశిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీచేసిందని, ఆ ఉత్తర్వులు నేటికీ అమలులో ఉన్నాయని, అయినప్పటికీ జివిఎంసి అధికారులు, పోలీస్ సిబ్బంది కలిసి మిగతా 2లో..

ఉపాధి హామీ వేతన బకాయిలు చెల్లించాలి

▶ వార్త 6లో..

పెంచిన విద్యుత్ ఛార్జీలపై దశలవారీ పోరాటం

▶ వార్త 5లో..

రుషికొండ ప్యాలెస్‌ను డెస్టినేషన్ వెడ్డింగ్స్‌కు ఇవ్వడం తగదు

▶ వార్త 2లో..

ట్రాన్స్‌పాండర్స్ వినియోగంపై అవగాహన



ట్రాన్స్‌పాండర్స్‌పై మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద ప్రభుత్వం మొదటి విడతగా విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్‌లో గల మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్లకు 618 ట్రాన్స్‌పాండర్స్‌ను 100 శాతం సబ్సిడీపై సరఫరా చేసిన క్రమంలో వాటి వినియోగం, పనితనంపై మరపడవల యజమానులు, డ్రైవర్స్‌కు శుక్రవారం అవగాహన కల్పించారు. ఆ నిమిత్తం సమావేశం ఏర్పాటు చేశారు. లబ్ధిదారుల సలహాలు, సూచనలను అధికారులు కోరారు.

బోటు యజమానులు, సంఘ ప్రతినిధులు ఎం.లక్ష్మణరావు, సిహెచ్. వీర్రాజు, ఎస్.నర్సింగరావు, ఎం.బాలాజీ, చిన్నా, ఎస్.రాము, కాకినాడ బోటు యజమానులు శ్రీనివాస్, రాజు అభిప్రాయాలను తెలియజేశారు. అనంతరం ఫిషరీస్ జెడి పి.లక్ష్మణరావు మాట్లాడుతూ ట్రాన్స్ పాండర్స్ వల్ల సముద్రంలో బోటు ఉన్న స్థానం తెలుసుకోవడం, చేపల లభ్యత, బోటు ప్రమాదంలో ఉన్నప్పుడు సమాచారం తెలియజేయుట సులభమవుతుందన్నారు. ఆ పరికరాలను సక్రమంగా వినియోగించుకోవాలని మత్స్యకారులకు సూచించారు. కార్యక్రమంలో షార్ శాస్త్రవేత్తలు సునీల్ కుమార్, పలాష్ జోషి, ఎన్ఎస్ఐఎల్ శాస్త్రవేత్త రాఘవేంద్ర, అవాంటెల్ టెక్నీషియన్స్ సత్యన్నారాయణ, రవికుమార్, ఎఫ్‌డిఒ ఆశాజ్యోతి, అనురాధ పాల్గొన్నారు.

భవిత కేంద్రాలతో బంగారు భవిష్యత్తు

ప్రత్యేకావసరాల పిల్లలకు ఉపకరణాల పంపిణీలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్



ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉపకరణాలు అందజేసిన కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అన్నిరకాల వసతులతో నిర్వహిస్తున్న భవిత కేంద్రాల ద్వారా ప్రత్యేక అవసరాలుగల చిన్నారులకు బంగారు భవిష్యత్తు లభిస్తుందని, సాధారణ పిల్లలకు ధీటుగా ఎదిగేందుకు పుష్కలమైన అవకాశాలు ఉంటాయని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలోని 11 భవిత కేంద్రాల ద్వారా ప్రాథమిక, మాధ్యమిక స్థాయిలోని సుమారు 2,474 మంది చిన్నారులకు వివిధ రకాల సేవలందిస్తున్నామని గుర్తు చేశారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాల గల పిల్లలకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన హాజరై చిన్నారులకు ఉపకరణాలు అందజేశారు. వారితో ముచ్చటించి, గ్రూపు ఫొటో దిగారు. వారు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలను తిలకించి అభినందించారు. ప్రోత్సహిస్తూ జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారులను, వారి తల్లిదండ్రులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడారు. ఇతరులు ఏమనుకుంటారో అనే సంశయాన్ని విడనాడి ప్రత్యేక అవసరాలుగల పిల్లలను సమీపంలో ఉన్న భవిత కేంద్రాలకు పంపించాలని సూచించారు. అక్కడ మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

సీనియారిటీ.. ఏదీ క్లారిటీ !

లేకుంటే సమస్య మళ్లీ మొదటికే వస్తుందని పలువురు టీచర్లు చెబుతున్నారు.

మొదటి సంతకం పెట్టాక ఏడాదైనా...

రాష్ట్రంలో ఏర్పడ్డ కూటమి ప్రభుత్వం తొలి సంతకం డిఎస్‌పిపై పెట్టింది. సుమారు ఏడాది సమీపిస్తున్నా డిఎస్‌సిపై పూటకో మాట చెబుతోంది. 2018 తర్వాత రాష్ట్రంలో డిఎస్‌సి తీయలేదు. పైగా ఇలా సీనియారిటీ జాబితాల తయారీ పేరుతో కాలయాపనే జరుగుతోంది. టీచర్ల సంఖ్యను ఎలా తగ్గించాలన్న గత జగన్ ప్రభుత్వ వ్యూహాన్నే ఈ ప్రభుత్వమూ అనుసరిస్తోందని యుటిఎఫ్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబేద్కర్ వెల్లడించారు. ఒకవైపు ఏడేళ్లుగా డిఎస్‌సి జాప్యం జరుగుతుంటే.. మరోవైపు ఎస్‌జిటి టీచర్ల సీనియారిటీ జాబితాల తయారీ నేటికీ సరిగా జరగకపోవడం దేనికి సూచికమని ఆయన ప్రశ్నిస్తున్నారు.

భవిత కేంద్రాలతో బంగారు భవిష్యత్తు

సిబ్బంది వారికి అన్ని రకాలుగా తర్ఫీదు ఇస్తారని, సాధారణ పిల్లలకు ధీటుగా ఎదిగేందుకు దోహదపడతారని అన్నారు. అలింకో సంస్థ సహకారంతో ఈ విడతలో రూ.96.85 లక్షల వ్యయంతో సమకూర్చిన 106 రకాల వస్తువులను 160 మందికి అందజేస్తున్నామని, మలి విడతలో మిగిలిన వారికి అందజేస్తామని చెప్పారు. ప్రత్యేక అవసరాలగల పిల్లలకు జిల్లా యంత్రాంగం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని, ఎక్కడైనా సమస్యలున్నా, అవసరాలున్నా తమ దృష్టికి తీసుకురావాలని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్తు విషయంలో కాస్త సమయం వెచ్చించాలని, ప్రత్యేక దృష్టి సారించాలని హితవు పలికారు. సహిత విద్యను ప్రోత్సహించేందుకుగాను ప్రత్యేక అవసరాలుగల పిల్లలకు 58 ట్యాబులు పంపిణీ చేశామని ఎపిసి చంద్రశేఖర్ తెలిపారు. జెడ్‌పిహెచ్‌ఎస్ కణితిలో చదువుతున్న పి.అమన్ జిల్లా స్థాయి చెస్ పోటీల్లో రాణించాడని, చంద్రంపాలెం పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థినులు పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఐఐటిల్లో సీట్లు సంపాదించుకున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో భాగంగా పలువురు చిన్నారులకు కలెక్టర్ చేతుల మీదుగా ట్రైసైకిళ్లు, బ్యాటరీ వాహనాలు, వినికిడి యంత్రాలు, వాకింగ్ స్టిక్స్, రోలేటర్లు, వీల్ ఛైర్లు అందజేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఎపిసి చంద్రశేఖరరావు, జిల్లా పరిషత్ సిఇఒ పి.నారాయణమూర్తి, జిల్లా ఐఇ కో-ఆర్డినేటర్ గీత, ఎపిఎం, సిఎంఒ, ఇతర అధికారులు, ప్రత్యేక అవసరాలుగల చిన్నారుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు ద్రోహం చేయొద్దు

భూములు కేటాయిస్తూ రాష్ట్ర కేబినెట్ ఆమోదించిందని, ఈ పరిశ్రమల నిర్వాసితులకు నేటికీ పూర్తిస్థాయిలో పరిహారం ఇవ్వలేదని వెల్లడించారు. ఇప్పటికే ఆ ప్రాంత ప్రజలు తీవ్ర కాలుష్యంతో బాధపడుతున్నారన్నారు. బల్క్‌డ్రగ్ పరిశ్రమ ఏర్పాటుతో ప్రజల ఆరోగ్యాలు మరింత ప్రమాదంలోకి నెట్టబడతాయని ఆందోళన వ్యక్తపరిచారు. భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం, ప్యాకేజీ, పునరావాసం కల్పించకుండా ఆగమేఘాలపై ఫార్మా కంపెనీలకు ఇచ్చే అనుమతులను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులందరికీ 2013 భూసేకరణ చట్ట ప్రకారం పరిహారం, ప్యాకేజీ, ఉపాధి అవకాశాలు కల్పించిన తరువాతే పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలని స్పష్టం చేశారు. నిర్వాసితుల సమస్యలు పరిష్కరించకుండా పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులిస్తే ప్రభుత్వం ప్రజాగ్రహానికి గురికాకతప్పదని హెచ్చరించారు.

బౌడారా రోడ్డులో తొలగింపులు

వచ్చి తమ నిర్మాణాలను తొలగించడం అన్యాయమని బాధితులు ఆరోపించారు. తమ గోడు అధికారులకు పట్టడం లేదన్నారు. ట్రాఫిక్‌కి ఎటువంటి అంతరాయమూ లేనప్పటికీ, మరోపక్క న్యాయ స్థానం ఆదేశాలు ఉన్నప్పటికీ నిర్మాణాలను తొలగించడం దారుణమన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

ఇన్‌ఫినిటీ లెర్న్ ఆత్రేయ ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దేశంలో ఫలితాల ఆధారిత అభ్యాసాన్ని పెద్ద ఎత్తున అందిస్తున్న హైబ్రిడ్ లెర్నింగ్ ప్లాట్‌ఫారమ్ ఇన్‌ఫినిటీ లెర్న్, శ్రీ చైతన్య అకాడమీ ఆధ్వర్యంలో ప్రత్యేక నీట్ కోర్సు 'ఆత్రేయ'ను ప్రారంభించారు. అందుకు సంబంధించిన పోస్టర్‌ను స్థానిక శ్రీ చైతన్య అకాడమీలో శుక్రవారం ఆవిష్కరించారు. ఇది డిజిటల్ టూల్స్‌తో పాటు రియల్ టైమ్ పనితీరు ట్రాకింగ్‌ను సమగ్రంగా అందిస్తుందని నిర్వాహకులు తెలిపారు. నీట్ అభ్యర్థులకు ఎక్కువగా సవాలుగా నిలిచేది ఫిజిక్స్ అని, దీనిపై ప్రత్యేకంగా దృష్టి పెడుతుందని పేర్కొన్నారు. పి2 సిబిజెడ్ ద్వారా ఫిజిక్స్ సెషన్లను రెట్టింపు చేస్తుందని, విద్యార్థులలో కాన్సెప్ట్ బలాన్ని పెంచి నీట్‌లో టాప్ ర్యాంకుల కోసం అవసరమైన శక్తిని అందిస్తుందని ఇన్‌ఫినిటీ లెర్న్ సహ వ్యవస్థాపకరాలు, శ్రీ చైతన్య గ్రూప్‌సిఇఒ సుష్మ బొప్పన మీడియాకు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌ఫినిటీ లెర్న్ (శ్రీ చైతన్య) ఉజ్జ్వల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రుషికొండ ప్యాలెస్‌ను డెస్టినేషన్ వెడ్డింగ్స్‌కు ఇవ్వడం తగదు

సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : గత వైసిపి ప్రభుత్వం నిర్మించిన రుషికొండ ప్యాలెస్ భవనాలను డెస్టినేషన్ వెడ్డింగ్స్‌కు ఇవ్వాలనే రాష్ట్ర కూటమి ప్రభుత్వ మంత్రి మండలి చర్చను సిపిఎం విశాఖ జిల్లా కమిటీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తక్షణం ఆ ప్రతిపాదనలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. విశాఖ ప్రజలకు ఉపయోగపడేలా గొప్ప సైన్స్ మ్యూజియంగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. మూడు రాజధానుల పేర రుషికొండ ప్యాలెస్ నిర్మాణానికి గత ప్రభుత్వం సుమారు రూ.500 కోట్లు ప్రజా ధనాన్ని ఖర్చు చేసిందని తెలిపారు. గత ఎన్నికల్లో ఈ భవనాలను సైన్స్ పార్క్ వంటి ప్రజా ప్రయోజనాలకు వినియోగిస్తామని టిడిపి, జనసేన ప్రచారం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. గెలిచాక ఆ భవనాల్లో ప్రజల సందర్శనకు అవకాశం కల్పిస్తామని స్వయానా చంద్రబాబు ప్రకటించారన్నారు. ఇప్పుడు ఈ వాగ్దానాల నుండి వైదొలగి దొడ్డిదారిన డెస్టినేషన్ వెడ్డింగ్ పేర వందల కోట్ల భవనాలను, సుమారు రూ.5 వేల కోట్ల విలువైన రుషికొండ మొత్తాన్ని బడా ప్రైవేట్ సంస్థకు ఇవ్వాలనే ఆలోచన కూటమి ప్రభుత్వం చేస్తున్నట్లు తెలుస్తోందన్నారు. అందుకే 10 నెలలైనా రాష్ట్ర ప్రభుత్వం దీనిపై చర్యలు తీసుకోకుండా ప్రైవేట్ శక్తులకు కట్టబెట్టడానికి అంతర్గత చర్చలు సాగిస్తోందన్న సందేహాన్ని వ్యక్తపరిచారు.

పైపెచ్చు మరికొన్ని హోటల్ గదులు నిర్మించాలనే చర్చలు చేయడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ చర్చలు ఈ ప్యాలెస్ భవనాలను కొద్ది మంది సంపన్నుల విలాసవంతమైన కార్యక్రమాలకు పరిమితం చేసేలా ఉన్నాయన్నారు.

మధ్యప్రదేశ్ పర్యాటక ప్రాంతాలపై ప్రచారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మధ్యప్రదేశ్ పర్యాటక ప్రాంతాలు దక్షిణాది పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయని మధ్యప్రదేశ్ స్టేట్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డిప్యూటీ డైరెక్టర్ వివేక్ జూడే అన్నారు. మధ్యప్రదేశ్ టూరిజాన్ని ప్రచారం చేయడంలో భాగంగా శుక్రవారం విశాఖపట్నంలో మధ్యప్రదేశ్ టూరిజం రోడ్ షోను ఓ ప్రైవేటు హోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణ భారతదేశ పర్యాటకులకు మధ్యప్రదేశ్ ఒక అద్భుతమైన గమ్యస్థానమని అన్నారు. దేశంలోనే అత్యధిక సంఖ్యలో పులులను కలిగిన మధ్యప్రదేశ్ టైగర్ స్టేట్ ఆఫ్ ఇండియా హోదాను దక్కించుకుందని తెలిపారు. తమ ప్రాంతంలో 30 శాతం అటవీ విస్తీర్ణం, 12 జాతీయ ఉద్యానవనాలు, 9 టైగర్ రిజర్వులతో దేశంలోనే వన్యప్రాణుల గమ్యస్థానంగా ఉందని పేర్కొన్నారు. మూడు బయోస్ఫియర్ రిజర్వులను కలిగి ఉన్నామన్నారు. మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర జ్యోతిర్లింగాలతో పాటు 14 ప్రత్యేక తీర్థయాత్ర స్థలాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో మధ్యప్రదేశ్ స్టేట్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అసిస్టెంట్ మేనేజర్ మునిష్ కౌశల్, రెసిడెంట్ మేనేజర్ వినోద్ జాట్ పాల్గొన్నారు.



పర్యాటక ప్రదేశాల వివరాలను వెల్లడిస్తున్న వివేక్ జూడే

జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో కారుణ్య నియామకం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మధురవాడలోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు బ్రాంచిలో మెసెంజర్‌గా పనిచేస్తూ గత ఏడాది నవంబర్ 3న మాదు రాంబాబు అకాల మరణం పొందిన నేపథ్యంలో ఆయన కుమారుడు ఎంబిసిహెచ్ఎస్.అజిత్ కుమార్ విద్యార్హతలను పరిగణలోకి తీసుకొని బ్యాంకు ఉద్యోగుల సర్వీసు నియమ నిబంధనలకు లోబడి కారుణ్య నియామకం చేపట్టినట్టు జాయింట్ కలెక్టర్, బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జ్ మయూర్ అశోక్ శుక్రవారం తెలిపారు. గత నెల 26న జరిగిన బ్యాంకు మహాజన సభ ఆమోదంతో ఈ నియామకం జరిగిందని తెలిపారు. ఈ క్రమంలో కారుణ్య నియామకం కింద నియామకపు ఉత్తర్వులను శుక్రవారం తన కార్యాలయంలో అందజేశారు.

కొండలరావుకు గిడ్డి ఈశ్వరి పరామర్శ

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం వంచల పంచాయతీ వి.చెరపల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పొత్తూరు కొండలరావును టిడిపి పాడేరు నియోజకవర్గం ఇన్‌ఛార్జి గిడ్డి ఈశ్వరి శుక్రవారం పరామర్శించారు. కొండలరావు రెండు రోజుల క్రితం ప్రమాదవశాత్తు గోతులో పడడంతో కుడికాలు వేళ్ళు ఎముకలు చిట్లుపోయాయి. చికిత్స అనంతరం ఆయన చింతపల్లిలో తన కుమార్తె ఇంటిలో విశ్రాంతి పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఈశ్వరి శుక్రవారం చింతపల్లిలో కొండలరావుకు పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

కల్యాణ మండప నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎంవిపి.కాలనీ సెక్టార్ 1లో విఎంఆర్‌డిఎకు చెందిన కల్యాణ మండప పున్ణనిర్మాణ పనులను గడువులోగా పూర్తి చేయాలని విఎంఆర్‌డిఎ ఛైర్మన్ ఎంవి.ప్రణవ్ గోపాల్ ఆదేశించారు. శుక్రవారం ఉదయం ఆయన కల్యాణ మండప నిర్మాణ పనులను పరిశీలించారు. స్థానిక శాసన సభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు సూచనల మేరకు స్థానికుల సౌకర్యార్థం కల్యాణ మండపాన్ని ఆధునికీకరిస్తున్నామని చెప్పారు. నిర్మాణ నాణ్యత విషయంలో రాజీ వద్దని సూచించారు. ఎసి సదుపాయం కల్పించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చెయ్యాలని సూచించారు. ఈ నెలాఖరులోపు అన్ని పనులూ పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. పార్కింగ్ కోసం స్థలం కేటాయించాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ కె రమేష్, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **VARSHA VALLURUPALLI**, D/o. Vallurupalli Prabhu Kishore, residing at H.No.40, Balaji Baymont, Peda Rushikonda, Near IT Park, Visakhapatnam-530 045, Andhra Pradesh.

As per my Aadhar & PAN Card my name is same. But in my Passport No.Z3366676 my father's name was wrongly printed as **VALLURUPALLI KISHORE.** His correct name is **VALLURUPALLI PRABHU KISHORE.** Both names relate to same person only.

మహారాజశ్రీ అనకాపల్లి ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O. S. 105 / 2024

బిట్వీన్ :
డిండి జగ్గప్పారావు . . . వాది
అండ్:
ఎల్లపు గోవిందా మరియొకరు . . . ప్రతివాదులు

దావా సమను

టు:
1వ ప్రతివాది:
ఎల్లపు గోవిందా, తండ్రి చంద్రరావు, హిందూ, వయస్సు 43 సం॥లు, డో.నెం. 44-42-6, నందగిరినగర్, మెయిన్‌రోడ్, అక్కయ్యపాలెం, దొండపర్తి, విశాఖపట్నం.

పై నెంబరు. దావాలో శ్రీకోర్టు వారు పంపిన సమన్లు మీరు అందుకోనందున పై కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **తే:15-4-2025దికి** వాయిదా వేసి ఉన్నారు. కావున ఆరోజు **ఉదయం 10-30 ని॥లకు** మీరు స్వయంగా గాని లేక మీ తరుపున లాయర్‌గారు గాని పై కోర్టులో హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షమందు పై దావా తీర్మానించబడును.

జి.నాగేశ్వరావు
అడ్వకేట్, అనకాపల్లి

IN THE HON'BLE COURT OF THE XI ADDL. DISTRICT JUDGE cum SPL. JUDGE FOR SC & ST CASES AT: VISAKHAPATNAM
I.A.16/2025 in O.S.55/2023

Between:
Kasireddi Ramanamma & 2 others ...Petitioners/Plaintiffs
And:
Nerella Sathi Raju & Another ...Respondents/Defendants

NOTICE

To,
R-1: Nerella Sathi Raju,
S/o. Ramulu, Hindu, aged 63 years, R/at D.No.58-15-125/1, Santhi Nagar, NAD Kotha Road, Visakhapatnam-530009.
R-2: Smt. Nerella Kalyani,
W/o. Sathi Raju, Hindu, aged 58 years,Rest-do-

Please take notice that the above named petitioners has instituted the above I.A. against both of you for final decree of O.S.55/2023 recovery of suit amount and with subsequent interest and costs, other reliefs and the I.A stands posted to **30-04-2025** for your appearance. Therefore, you are hereby summoned to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **30-04-2025** at **10:30 A.M** in the above Court to answer all material questions, failing which the suit / I.A. will be heard and determined in your absence, exparte as per law.

(By Order of the Hon'ble Court)
P. RAMJI,
M (P) HEMALATHA,
Advocates, Visakhapatnam.

IN THE HON'BLE COURT OF II ADDL. DISTRICT AND SESSIONS JUDGE AT VISAKHAPATNAM
E.A.130/2024 in E.P.21/2017 in O.S.313/2011

Between:
Sri Bogineni Subbarao Chowdhary ...Petitioner/D.Hr/Plaintiff
And:
1. Sri Komarina Rama Rao (Died) ...J.Dr/Defendant
2. Smt Komarina Satisavitri & 2 others ...Proposed Respondents/J.Drs/Defendants

NOTICE

To,
R-3: Smt. Komarina Sri Vidhya,
D/o. Late Komarina Rama Rao, Hindu, aged 38 years, R/o D.No.58-14-59, Plot No.36, Journalist Colony, Marripalem, VUDA Layout, Opposite District Co-Operative Bank, Visakhapatnam.
R-4: Sri Komarina Satya Kishore,
S/o. Late Komarina Rama Rao, Hindu, aged 36 years, R/o D.No.58-14-59, Plot No.36, Journalist Colony, Marripalem, VUDA Layout, Opposite District Co-Operative Bank, Visakhapatnam.

Please take notice and appear either in person or through an Advocate before Hon'ble Court of the II Addl. District And Sessions Judge at Visakhapatnam in E.A.130/2024 in E.P.21/2017 in O.S.313/2011 on **21-04-2025 at 10:30 A.M** and file your objections if any failing which the Hon'ble Court will pass an ex-pate orders against both of you.

(ByOrder of the Hon'ble Court)
D.V.V.R. PRATAP
R. SARADA NAGARJUN
Advocates, Visakhapatnam

పోర్టు ఆసుపత్రిని ప్రైవేటుకు ఇవ్వొద్దు

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ పోర్టు గోల్డెన్ జుబ్లీ ఆసుపత్రిని ప్రయివేటుకు అప్పగించరాదని యునైటెడ్ పోర్ట్సు అండ్ డాక్ ఎంప్లాయిస్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ త్రినాధ్ అన్నారు. శుక్రవారం మిందిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, పోర్టు ఆసుపత్రిని ప్రయివేటుపరం చేస్తే ఉద్యోగులు, కార్మికులు, పెన్షనర్లతోపాటు వారి కుటుంబీకులు వైద్యానికి దూరమైపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. వేలకోట్లు ఆస్తులు, కోట్లలో సాలుసరి ఆదాయం వస్తున్న విశాఖ పోర్టు నిధులతో ఆసుపత్రిని అభివృద్ధి చేయాలని, మెరుగైన సేవలు అందించాలని కోరారు. పిపిపి విధానంలో అభివృద్ధికి ఆహ్వానించిన టెండర్లను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పోర్టు పెన్షనర్ గుర్నాధరావు పాల్గొన్నారు.

బాధితురాలిని పరామర్శించిన పంచకర్ల

ప్రజాశక్తి -మధురవాడ :ప్రేమోన్మాది దాడిలో గాయపడి మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కొమ్మాది, స్వయంకృషి నగర్‌కు చెందిన బాధితురాలు దీపికను భీమిలి నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి సందీప్ పంచకర్ల శుక్రవారం పరామర్శచారు. బాధితురాలి ఆరోగ్య పరిస్థితిని, అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. రిమాండ్‌లో ఉన్న నిందితుడికి చట్టపరంగా ప్రభుత్వం శిక్షిస్తుందని భరోసానిచ్చారు. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. జనసేన నాయకులు శాఖరి శ్రీనివాస్, దేవర శివ, పోతిన అనురాధ పాల్గొన్నారు.

డైట్‌లో ఖాళీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డైట్‌లో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపల్ ఎం జ్యోతికుమారి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. అమరావతి పాఠశాల విద్యా శాఖ సంచాలకులు నోటిఫికేషన్ జారీ చేశారన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని ప్రభుత్వ, జెడ్‌పి, నగర పాలక సంస్థల్లో పని చేస్తున్న ఎంఇఒలు, హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లతో డిప్యుటేషన్ పద్ధతిలో డైట్‌లోని అధ్యాపకపోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అర్హత గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి, సంబంధిత దరఖాస్తుతో పాటు సర్టిఫికెట్లను ఈనెల 10లోగా ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల లోపు పనిదినాల్లో అందజేయాలని సూచించారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం ఈనెల 16, 17 తేదీల్లో రాత పరీక్ష, 19న మౌఖిక పరీక్ష నిర్వహించి, అర్హులను ఎంపిక చేస్తామన్నారు.

'అవంతి'లో ఉచిత పాలిసెట్ శిక్షణ

ప్రజాశక్తి -తగరపువలస: స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో టెన్త్ విద్యార్థులకు పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ఈ నెల 7 నుంచి ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు అవంతి విద్యాసంస్థల ఛైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు శుక్ర వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత బస్సు సదుపాయంతో పాటు మెటీరియల్ కూడా అందజేస్తామని, గ్రామీణ ప్రాంత విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

బిక్కుబిక్కుమంటూ వ్యాపారాలు

శిథిలావస్థలో పెదగంట్యాడ ఎస్‌సి కార్పొరేషన్ దుకాణ సముదాయం



ఊడిపడిన దుకాణ సముదాయం రెయిలింగ్

ప్రజాశక్తి- గాజువాక : పెదగంట్యాడలో ఎస్‌సి కార్పొరేషన్ నిధులతో 1999లో నిర్మించిన దుకాణాల సముదాయ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎస్‌సి సామాజిక వర్గ నిర్వాసితుల కోసం కేటాయించిన దుకాణాల్లో కొన్నాళ్ల క్రితం వరకు వ్యాపారాలు చేసుకుని జీవనం సాగించారు. అయితే మూడేళ్లగా సముదాయంలోని కొన్ని దుకాణాల్లో కొన్నింటిలో వర్షం కురిసేటప్పుడు శ్లాబుల నుంచి నీరు లీకవ్వడం లోపలున్న వస్తువులన్నీ తడిసి పాడైపోయాయి. అలాగే కొన్నాళ్లపాటు కొనసాగినా, తర్వాత కొన్ని దుకాణాలను ఖాళీ చేసేశారు. మిగిలిన షాపులు నడుపుతున్నప్పటికీ ఏ సమయంలో కూలుతుందోనన్న భయంతో బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నారు. శిథిలావస్థలో ఉన్న దుకాణాల వద్దకు కొనుగోలు చేసేందుకు ప్రజలు భయపడడంతో వ్యాపారాలు కూడా తగ్గిపోయాయని దుకాణదారులు అంటున్నారు ఇటువంటి పరిస్థితుల్లో రెండు రోజుల క్రితం దుకాణ సముదాయ భవనానికి పైనున్న రెయిలింగ్ ఒక్కసారిగా కూలిపోయింది. ఆ సమయంలో అక్కడెవరూ లేకపోవడంతో పెద్దప్రమాదమే తప్పింది.గట్టిగా తోస్తే కూలిపోయే స్థితిలో ఉన్న ఈ భవనంలో దుకాణాల నిర్వహణ ఇక కష్టమేనని వ్యాపారులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో శిథిలావస్థకు చేరిన దుకాణ సముదాయాన్ని కూలగొట్టి, వాటి స్థానంలో కొత్త భవనాలను పునర్నించి ఇవ్వాలని షాపుల యజమానులు కోరుతున్నారు.ప్రాణాపాయ ప్రమాదం జరగకముందే తగు చర్యలు చేపట్టాలని వేడుకుంటున్నారు. దీనిపై సంబంధిత అధికారులు ఎలా స్పందిస్తారో చూడాలి.

'దివీస్'లో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలి

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం, చిప్పాడ దివీస్ పరిశ్రమలో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలని టిడిపి మండల అధ్యక్షులు డిఎఎన్ రాజు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం చిప్పాడ లోని మాజీ జెడ్‌పిటిసి సరగడ అప్పారావు నివాస ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడుతూ, ఇక్కడి సహజ వనరులను పూర్తిస్థాయిలో ఉపయోగించు కుంటున్న పరిశ్రమల యాజమాన్యాలు, స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించకపోవడం అన్యాయమన్నారు. గత ప్రభుత్వ హయంలో జరిగిన విషయాలను పక్కనపెట్టి, ఇప్పుడైనా యాజమాన్య వైఖరిలో మార్పు రావాలని కోరారు. జెడ్‌పిటిసి గాడు వెంకటప్పడు మాట్లాడుతూ, నిరుద్యోగ సమస్య తీవ్రమవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఉపాధి, ఉద్యోగ కల్పన ప్రధాన అంశంగా చూడాలన్నారు. ఎపి మెకనైజ్డ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎం లక్షణరావు మాట్లాడుతూ, ఇక్కడ ఫార్మా పరిశ్రమ ఉందన్న ఆశతో బిఎస్‌సి, ఎంఎస్‌సి కెమిస్ట్రీ, ఫార్మా కోర్సులు చదివి, నిరుద్యోగులుగా ఉన్న స్థానికగ్రామీణ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు. మాజీ జెడ్‌పిటిసి సరగడ అప్పారావు మాట్లాడుతూ, యాజమాన్యం దూరదృష్టి తో ఆలోచించి, అర్హులైన స్థానికులకు పరిశ్రమలో ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో పలువురు ఎంపిటిసిలు, మాజీ సర్పంచ్‌లు, టిడిపి నేతల పతివాడ రాంబాబు, వై అనిల్‌ప్రసాద్, గరికిన పరశురామ్, ఎస్ ప్రకాష్, తమ్మిన వెంకటరమణ పాత్రుడు, ఉమ్మిడి అప్పన్న పాల్గొన్నారు

పోలీసులపై అసత్య ప్రచారాలు మానుకోవాలి : ఎసిపి

ప్రజాశక్తి -గాజువాక : పోలీసులపై అసత్య ప్రచారాలు మానుకోవాలని, సౌత్ సబ్ డివిజన్ ఎసిపి త్రినాధ్ అన్నారు. శుక్రవారం గాజువాక పోలీస్ కాంప్లెక్స్‌లో మీడియాతో మాట్లాడుతూ, ఈ ఏడాది జనవరి నెలలో గాజువాకలో రోజారాణి, వేరే కుటుంబం మధ్య గొడవలో రోజారాణి గాజువాక స్టేషన్‌కు వస్తే చట్టపరిధిలో ఆమెకు న్యాయం చేశామన్నారు. అయితే ఈ వ్యవహారంలో తనకు న్యాయం జరగలేదని గాజువాక పోలీసులపై రోజారాణి ఆరోపణలు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. రెండు కుటుంబాలు మధ్య గొడవలో పరస్పరం అందిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి, దర్యాప్తు అనంతరం రోజారాణిపై వచ్చిన ఆరోపణలకు ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో ఆమెపై వచ్చిన ఫిర్యాదును తిరస్కరించామన్నారు. రోజారాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, వేరేపార్టీపై వీడియోల ఆధారంగా అదనపు సెక్షన్లు కూడా పెట్టామన్నారు. సమావేశంలో సిఐ పార్థసారథి, ఎస్ఐ రవికుమార్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

లారీ ఢీకొని ఫార్మా కార్మికుడు దుర్మరణం

ప్రజాశక్తి -అచ్యుతాపురం : అచ్యుతపురం జంక్షన్‌లో శుక్రవారం ఉదయం లారీ ఢీకొన్న ప్రమాదంలో ఫార్మా కార్మికుడు దుర్మరణం చెందారు. సర్కిల్ ఇన్స్పెక్టర్ నమ్మి గణేష్ తెలిపిన వివరాలు ప్రకారం... విజయనగరం జిల్లా జి.నరసింహపురం గ్రామానికి చెందిన బగాధి రమణారావు (40) మోసయ్యపేట పంచాయతీ బర్మా కాలనీలో భార్యా పిల్లలతో నివాసం ఉంటున్నాడు. పరవాడ ఫార్మా ఎస్వీఆర్ డ్రగ్స్‌లో రమణారావు పనిచేస్తున్నారు. అయన శుక్రవారం ఉదయం విధులకు వెళ్లటానికి జంక్షన్‌లో వెళ్తుండగా లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతను తీవ్రంగా గాయపడి ప్రమాద సంఘటనా స్థలంలో మృతి చెందారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

మద్యం బాటిళ్లు ధ్వంసం

ప్రజాశక్తి -ఆనందపురం: అనందపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో 2020 - 24 మధ్యకాలంలో వివిధ కేసుల్లో పట్టుబడిన మద్యం బాటిళ్లను శుక్రవారం ఎపి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ బి ఈశ్వరరావు, సిబ్బంది అధ్వర్యంలో ఆనందపురం పోలీసులు ధ్వంసం చేశారు. నాలుగేళ్లలో 44 కేసుల్లో పట్టుకున్న మద్యం బాటిళ్లతోపాటు, రెండు కేసులలో సీజ్ చేసిన 1728,32 లీటర్ల సారాను ధ్వంసం చేశారు. సిఐ వాసునాయుడు, విఆర్ఒ వరహాలు ఆధ్వర్యంలో ముందుగా పంచనామా నిర్వహించారు.

6న పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి -సీతమ్మధార : ఈ నెల 6న, శ్రీరామనవమి పర్వదినాన విశాఖ పౌరగ్రంథాలయంలో కళావేదిక కల్చరల్ అండ్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ నండూరి రామకృష్ణ రచించిన 'సామాజిక నిత్య హితోక్తులు' కవితా సంపుటి ఆవిష్కరిస్తున్నట్లు కళావేదిక కార్యదర్శి డాక్టర్ బి.రజని తెలిపారు. కళావేదిక గౌరవాధ్యక్షులు కమల్ బైద్ సభాధ్యక్షతన నిర్వహించే కార్యక్రమానికి విశాఖ పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ముఖ్య అతిథిగా విశాఖ జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ -1 అధ్యక్షులు జి.తనూజా రెడ్డి, జాతీయ జర్నలిస్టు సంఘం సెక్రటరీ గంట్ల శ్రీనుబాబు ,విశిష్ట అతిథులుగా పాల్గొని ఆవిష్కరిస్తారని తెలిపారు .విశ్రాంత తెలుగు అధ్యాపకుడు డాక్టర్ ఎం.సుబ్బారావు పుస్తకసమీక్ష నిర్వహిస్తారన్నారు. పలువురు సీనియర్ జర్నలిస్టులను, కరాటేలో విశేష ప్రతిభ చూపుతున్న చిన్నారులను సత్కరిస్తున్నట్లు డాక్టర్ రజని తెలిపారు.

ఘనంగా నూకాలమ్మ మారువారం పండగ

ప్రజాశక్తి- భీమునిపట్నం : భీమిలి గ్రామదేవత నూకాలమ్మ మారువారం పండుగ సందర్భంగా శుక్రవారం గుడి వద్ద స్థానిక ఆర్యవైశ్య యువజన సంఘం ఉపాధ్యక్షులు ఎస్ రాఘవ ఆర్థిక సాయంతో 1500 మంది కి పులిహోర ప్రసాదం, మజ్జిగ పంపిణీ చేసినట్లు సంఘం అధ్యక్షులు ముమ్మిడిశెట్టి సునీల్ తెలిపారు.కార్యక్రమంలో వాసవి కన్యకాపరమేశ్వరి సంఘం అధ్యక్షులు పి శ్రీనివాస్, ఎస్ శ్రీను పాల్గొన్నారు

ఘనంగా పోలమాంబ రాట మహోత్సవం



వేడుకలో పాల్గొన్న కమిటీ సభ్యులు, టిడిపి నేతలు

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 9వ వార్డు, కొండవాలు ప్రాంతమైన సంజయ్‌గాంధీ కాలనీ గ్రామ దేవత పోలమాంబ రాట మహోత్సవాన్ని ఆలయ ధర్మకర్త కంచుమర్తి నాగరాజు దంపతులు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు టిడిపి నాయకులు బుడుమూరు గోవిందులు అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయం కమిటీ అధ్యక్షులు ఒమ్మి రాజు మాట్లాడుతూ ఈ నెల 11 నుంచి 15 వరకు పోలమాంబ ఉత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ కోశాధికారి కంచుమర్తి శ్రీనివాసరావు, బమ్మిడి మహేష్, రొంగలి కృష్ణ, వినయ్, సంతోష్ పాల్గొన్నారు.



ఆనందపురంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

ఆన్‌లైన్‌లో పోటెత్తిన దరఖాస్తులు : ఎంపికలకు అరకొరగా హాజరు

ప్రజాశక్తి -ఆనందపురం : బిసి కార్పొరేషన్ ద్వారా రాయితీ రుణాలకు శుక్రవారం స్థానిక మండల పరిషత్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఎంపిడిఒ డాక్టర్ వి.జానకి తెలిపారు. మండలానికి 80 యూనిట్లు కేటాయించగా, ఆన్‌లైన్‌లో 848 దరఖాస్తులు రాగా వేములవలస, ఆనందపురం, వెల్లంకి, చందక పంచాయతీల పరిధిలోని లబ్దిదారులకు శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించగా, 203 మంది హాజరయ్యారు. ఎంపిడిఒతోపాటు ఇఒపిఆర్‌డిసత్యనారాయణ, ఆనందపురం గ్రామ కార్యదర్శి రఘునాథ్ బాబు, ఆనందపురం యూనియన్ బ్యాంక్, వేములవలస బ్యాంక్ ఆఫ్ బరోడా, వెల్లంకి స్టేట్ బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

7న మళ్లీఇంటర్వ్యూలు

శుక్రవారం ఇంటర్వ్యూకు హాజరు కాని దరఖాస్తుదారులతోపాటు, మండలంలోని మిగిలిన గ్రామ పంచాయతీల పరిధిలోని దరఖాస్తుదారులందరూ ఈనెల 7న మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూలకు రావాలని ఎంపిడిఒ జానకి కోరారు. శొంఠ్యాం, వేములవలస ఎపిజివిబిలు, వేములవలస బ్యాంకు ఆఫ్ బరోడా, గిడిజాల బ్యాంకు ఆఫ్ ఇండియా, గంభీరం ఇండియన్‌బ్యాంకు, శొంఠ్యాం,వెల్లంకి ఎస్‌బిఐలు, ఆనందపురం యూనియన్ బ్యాంక్ అధికారులు ఇంటర్వ్యూలో పాల్గొంటారన్నారు.

పద్మనాభం.: స్థానిక మండల పరిషత్ కార్యాంయంలో ఎంపిడిఒ ఎం.విజయకుమార్ ఆధ్వర్యంలో బిసి కార్పొరేషన్ ద్వారా రాయితీ రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలంలోని 24 గ్రామాల నుండి 374 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా, బిసి కార్పొరేషన్‌కు 331, ఒసి కేటగిరిలో 15, కాపు కార్పొరేషన్‌కు 28 దరఖాస్తులు వచ్చాయి. శుక్రవారం ఇంటర్వ్యూలకు 80మంది బిసిలు, 16 మంది ఒసిలు, 15మంది కాపు అభ్యర్థులు హాజరయారు. వీరిలో నలుగురు జనరిక్ మందులషాపులకు దరఖాస్తు చేసుకున్నారు.

కె.కోటపాడు : బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాల కొరకు దరఖాస్తు చేసుకున్న వారికి స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. వివిధ రకాల రుణాల కొరకు 648 మంది దరఖాస్తులు చేసుకోగా ఇంటర్వ్యూలకు 525 మంది హాజరయ్యారని ఎంపీడీవో సాంబశివరావు తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమై సాయంత్రం వరకు ఈ ఇంటర్వ్యూలు జరిగాయని, ఉదయం కె.కోటపాడు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, లంకవానిపాలెం ఇండియన్ బ్యాంకు, గోవాడ స్టేట్ బ్యాంక్ ప్రతినిధులు, మధ్యాహ్నం గ్రామీణ వికాస బ్యాంక్ ఆనందపురం. కే కోటపాడు, చౌడువాడ బ్రాంచీల ప్రతినిధులు ఇంటర్వ్యూ నిర్వహించారు.

ఆలోచింపజేసిన భారత్ ఫెస్ట్ 25



ప్రదర్శనను తిలకిస్తున్న డాక్టర్ సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి -భీమునిపట్నం: స్థానిక బ్యాంక్ కాలనీలో ఉన్న విద్యాసాగర పాఠశాలలో శుక్రవారం 'భారత్ ఫెస్ట్,25' పేరిట ఏర్పాటు చేసిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ఎంతగానో ఆలోచింప జేసింది. రెండో తరగతి మొదలు 9వ తరగతి విద్యార్థులు ప్రదర్శించిన పలు నమూనాలు వారి అసాధారణ ప్రతిభ కు, వారిలో అంతర్లీనంగా ఉన్న సృజనకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచాయి. ప్రీ ప్రైమరీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఆద్యంతం ఉత్సాహంగా, ఉల్లాసంగా జరిగాయి. పాఠశాల అధ్యక్షులు డాక్టర్ కె సుబ్రమణ్యం, డైరెక్టర్ కెఎల్ఎన్ మూర్తి, కరస్పాండెంట్ కె.శాంతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు,వారి తల్లి దండ్రులు పాల్గొన్నారు ఫెస్ట్‌లో విద్యార్థులు ప్రదర్శించిన పలు నమూనాలను పాఠశాల అధ్యక్షులు డాక్టర్ కె.సుబ్రమణ్యం తిలకించారు. విద్యార్థుల ప్రతిభను కొనియాడారు.

తాటిముంజలుకు భలే గిరాకీ



పద్మనాభంలో తాటిముంజలు విక్రయిస్తున్న గీత కార్మికుడు

ప్రజాశక్తి -పద్మనాభం : వేసవి ఎండలు మండుతున్న నేపథ్యంలో వాటి నుంచి ఉపశమనానికి ప్రజలు అందుబాటులో ఉన్న అన్ని మార్గాలను ఆశ్రయిస్తుంటారు. ఇందులో భాగంగా తాటిముంజలు తింటే, దాహార్తి తీరడంతోపాటు ఉపశమనం కలగడంతో వీటికి మంచి గిరాకీ ఉంటుది. శుక్రవారం పద్మనాభం జంక్షన్‌లో ఆ గ్రామానికి చెందిన బుత్తల నూకరాజు. భార్య మంగ తాటిముంజలు అమ్మకాలు చేపట్టగా, పలువురు వాటిని కొనేందుకు ఎగబడడంతో హాట్‌కేకుల్లా అమ్ముడుపోయాయి. సీజన్‌లో కొత్తఫలం కావడంతోపాటు మండుతున్న ఎండల నుంచి మంచి ఉపశమనం కలుగుతుందన్న నమ్మకంతో డజను రూ.50లకు అమ్మినా, పలువురు కొనుగోలు చేశారు.

'అధినేత మాటకు కట్టుబడి ఉంటాం'



ప్లకార్డులతో వైఖరి స్పష్టం చేస్తున్న జనసేన కార్పొరేటర్లు

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి కౌన్సిల్‌లో మేయర్, డిప్యూటీ మేయర్లపై అవిశ్వాస తీర్మానంలో జనసేన కార్పొరేటర్లంతా ఏకతాటిపై అధినేత నిర్ణయానికి కట్టుబడి ఉంటామని పిఎసి సభ్యులు కోన తాతారావు స్పష్టం చేశారు పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విశాఖ నగర అధ్యక్షులు, సౌత్ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆదేశాలమేరకు నడుచుకుంటామన్నారు. శుక్రవారం సీతంపేట జనసేన కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ప్లకార్డులతో తమవైఖరి స్పష్టం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కార్పొరేటర్లు, ఎక్స్‌అఫీషియో సభ్యులతో కలిసి జనసేనకు 14మంది ఉన్నామమన్నారు. వైసిపి నుంచి జివిఎంసిని కాపాడే బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందని, పవన్‌కల్యాణ్ నిర్ణయం మేరకు తాము నడుచుకుంటామన్నారు. టిడిఆర్‌లు దోచుకున్న మేయర్, షాడో మేయర్‌లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జనసేనకార్పొరేటర్లు గోవిందరెడ్డి, ఉష శ్రీ, కందుల నాగరాజు, మూర్తి యాదవ్, పూర్ణశ్రీ సురేష్, సాదిక్, దక్షిణ నియోజకవర్గ ప్రతినిధి శివప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించుకోవాలి

- టెన్త్, ఇంటర్ విద్యార్థులకు ముగిసిన విసిసి, ఎస్ఎఫ్ఐ రిఫ్రెష్‌మెంట్ క్యాంప్



సమ్మర్ రిఫ్రెష్‌మెంట్ క్యాంప్‌లో విద్యార్థులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : సామాజిక మార్పులను గమనిస్తూ, విద్యార్థులు భవిష్యత్ ప్రణాళికతో పాటు శాస్త్రీయ దృక్పథంఆలోచన పెంపొందించేందుకు కృషి చేయాలని పలువురు సూచించారు. వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్, ఎస్ఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి ఫంక్షన్ హాల్‌లో టెన్త్, ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు నిర్వహించిన మూడురోజుల రిఫ్రెష్‌మెంట్ క్యాంపు శుక్రవారం తో ముగిసింది.

ఈ సందర్భంగా క్యాంప్ నిర్వాహకులు డాక్టర్ .కె రమాప్రభ, డాక్టర్ జి ప్రియాంక, డాక్టర్ బి.గంగారావు, ఎల్‌జె నాయుడు, డి రాము తదితరులు విద్యార్థులకు పలు అంశాలను బోధించారు. ప్రస్తుత సమాజంపై కుల, మత ప్రభావం, వాటి దుష్పరిణామాలను వివరించి, అందరూ సమానభావంతో మెలగాలని సూచించారు. ఈసందర్భంగా విద్యార్థులకు నృత్యం, కోలాటం, పాటలపై శిక్షణనిచ్చారు.

క్యాంప్‌నకు ప్రిన్సిపల్‌గా సాయితేజ, కోఆర్డినేటర్‌గా ఎం గుణశంకర్ వ్యవహరిం చగా, విసిసి ఆర్గనైజర్ ఎ.మణి, డి శైలజ సంధ్య, పద్మ, ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం శశి, జి అజయ్, డి వెంకటరమణ పాల్గొన్నారు.వేసవి సెలవుల్లో చేయాల్సిన కార్యక్రమాలపై చర్చించి, కొన్ని కర్తవ్యాలు తీసుకున్నారు. 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. క్యాంప్ నిర్వహణకు ఆతిథ్యమిచ్చిన వాసవి కన్యకాపరమేశ్వరి ఫంక్షన్ హాల్ నిర్వహణ కమిటీకి క్యాంప్ నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు. తాము చేస్తున్న సేవా కార్యక్రమాలను ఫంక్షన్ హాల్ నిర్వహణ కమిటీ అధ్యక్షులు పి శ్రీనివాసరావు, బి కిరణ్ విద్యార్థులకు వివరించారు.

సుహృద్భావ వాతావరణంలోనే సరైన తీర్పులు



పరిచయ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : న్యాయమూర్తులు, న్యాయవాదుల మధ్య సుహృద్భావ వాతావరణం ఉన్ననాడే సమాజానికి ఉపయోగపడే తీర్పులు వస్తాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలిపాటి గిరిధర్ అన్నారు. శుక్రవారం న్యాయవాదుల గ్రంథాలయంలో న్యాయవాదుల సంఘం నూతన కార్యవర్గం పరిచయ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. న్యాయమూర్తులకు, న్యాయవాదులకు మధ్య కార్యవర్గం వారధిలా వ్యవహరించి పనిచేయాలని కోరారు. నూతనంగా ఎంపికైన న్యాయవాదుల సంఘం అధ్యక్షులు ఎంకె శ్రీనివాస్ మాట్లాడుతూ, న్యాయవాదులు సర్టిఫైడ్ కాపీలు పొందడంలోనూ, పాత కోర్టుల భవనానికి, నూతన 10 కోర్టుల భవనానికి అనుసంధానంగా ర్యాంపు నిర్మాణానికి, కోర్టులలోను, న్యాయవాదుల విశ్రాంతి భవనాల్లోనూ మౌలిక వసతుల కొరతను న్యాయమూర్తికి వివరించారు. దీనిపై జిల్లా ప్రధాన న్యాయమూర్తి గిరిధర్ స్పందిస్తూ హైకోర్టు న్యాయమూర్తి, విశాఖపట్నం పరిపాలన న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లి, సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. న్యాయమూర్తులందరికీ కొత్త కార్యవర్గాన్నిపరిచయం చేశారు కొత్త కార్యవర్గాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయవాదుల సంఘం సత్కరించింది. కార్యక్రమంలో ఒకటవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం వెంకటరమణ, ప్రధాన ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి కె.రథరత్నం, న్యాయవాదుల సంఘం పూర్వ అధ్యక్షులు బెవరా సత్యనారాయణ, చింతపల్లి రాంబాబు ఇతర న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

గ్లకోమా శస్త్రచికిత్సతో చిన్నారికి కంటిచూపు



ఆపరేషన్ చేయించుకున్న చిన్నారి

ప్రజాశక్తి- వేపగుంట గ్లకోమా వ్యాధితో బాధపడుతున్న ఎనిమిది నెలల గిరిజన చిన్నారికి విజయ వంతంగా ఆపరేషన్ నిర్వహించి, శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వైద్యనిపుణులు అంధత్వాన్ని నివారించడంతోపాటు కంటి చూపును ప్రసాదించారు. ఆసుపత్రి డిజిఎం పిఆర్ కె.బంగారురాజు అందించిన వివరాలివి.

అల్లూరి జిల్లా అరుకులోయ మండలం బట్టివలసలో శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించగా, ఎనిమిది నెలల చిన్నారి కుడికంటిలోం నిరంతరం నీరు కారడాన్ని గమనించిన తల్లిదండ్రులు వైద్యపరీక్షలు తెచ్చారు. వైద్యశిబిరంలోని డాక్టర్ సమృద్ధి దేశ్‌ముఖ్ చిన్నారి కంటిని పరీక్షించి, నీటికాసులు (గ్లకోమా) వ్యాధిగా ప్రాథమికంగా నిర్ధారించి, మెరుగైన వైద్యానికి శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి రిఫర్ చేశారు.

విశాఖలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రిలో గ్లకోమా విభాగాధిపతి, సిక్యూఐ, రీసెర్చి డైరెక్టర్ డాక్టర్ టి.రవీంద్ర ఆధ్వర్యంలో వైద్యబృందం పరీక్షలు జరిపి, ట్రాబెక్యులోటోమీ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి, దృష్టిని ప్రసాదించారు. భవిష్యత్ అంతా అంధకారంలో మగ్గాల్సిన తమ బిడ్డకు సకాలంలో వైద్యం నిర్వహించి, కంటిచూపు ప్రసాదించిన వైద్యులకు బాలిక తల్లిదండ్రులు ధన్యవాదాలు తెలిపారు. వైద్యులను ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ ఎ.కృష్ణకుమార్, జిఎం కె.రాధాకృష్ణన్ అభినందించారు.

ఆటిజాన్ని ముందుగా గుర్తిస్తే దూరం చేయొచ్చు

ప్రజాశక్తి - ఆరిలోవ : పిల్లల్లో అసాధారణ ప్రవర్తన ఆటిజం రోగంగా అనుమానించవచ్చని రెయిన్ బో ఆసుపత్రి చిన్న పిల్లల వైద్యులు తెలిపారు. రోగ లక్షణాలను ముందుగా కనిపిస్తే, రోగ నిర్ధారణ జరిపి వెంటనే వైద్యం అందిస్తే కాపాడవచ్చని వైద్యులు అంటున్నారు. శుక్రవారం ఆరిలోవ హెల్త్ సిటీ రెయిన్‌బో ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆటిజం వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నపిల్లల్లో కనిపించ ఆటిజం వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ అశ్వనిమోహన్, డాక్టర్ ప్రసన్న కుమార్, డాక్టర్ దీపా మోహన్, డాక్టర్ శ్రీలక్ష్మీ, డాక్టర్ కుమార్, డాక్టర్ దివ్య జ్యోతి మాట్లాడుతూ భారత్‌లో ప్రతి 68 మంది పిల్లల్లో ఒకరు ఆటిజం వ్యాధితో బాధపడుతున్నారన్నారు. ఇతరులతో సమాచారం పంచుకోవడం, ఎదుటవారి కళ్లల్లో కళ్ళు కలిపి చూస్తూ మాట్లాడలేక పోవడం, ఎంత పిలిచినా పలకకుండా వినికిడి లోపం ఉన్నట్లు ప్రవర్తించడం, కుదురుగా ఉండకుండా ఎప్పుడూ పరుగెడుతూ ఉండడం, చేసిన పనినే మళ్లీ చేస్తుండడం వంటి లక్షణాలు ఉంటే ఆటిజంగా అనుమానించవచ్చన్నారు.రెండేళ్ల వయస్సు నుండే ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. చాలా మంది తల్లిదండ్రుల్లో అవగాహన లేకపోవడంతో ఆటిజం వ్యాధిని సకాలంలో గుర్తించలేకపోతున్నారన్నారు. ఐదేళ్లలోపు ఆటిజాన్ని గుర్తించి, చికిత్స అందించడాన్ని స్వర్ణ కాలంగా పరిగణిస్తున్నట్లు తెలిపారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న రెయిన్ బో వైద్యులు

భీమిలి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా రామస్వామి నాయుడు



రామస్వామినాయుడు

ప్రజాశక్తి-పద్మనాభం: భీమిలి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మండల జనసేన పార్టీ అధ్యక్షుడు కురిమిన రామస్వామి నాయుడు నియమితుల య్యారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం రెండోవిడత మార్కెట్ కమిటీ చైర్మన్ల జాబితాను ప్రకటించింది. మండలంలోని అయినాడ పంచాయతీ కేంద్రానికి చెందిన రామస్వామి నాయుడుకు మండలంలో జనసేన పార్టీ నేతగా చిత్తశుద్ధితో సేవలు అందించడంతోపాటు పార్టీ మండల అధ్యక్షుడిగా పార్టీని ఒక స్థాయికి తీసుకొచ్చేందుకు విశేషకృషి చేశారు. అన్ని గ్రామాల్లోని ప్రతి నాయకుడు, కార్యకర్తలను గుర్తించి, వారిని పార్టీపట్ల అంకితభావంతో సేవలందించేలా చర్యలు చేపట్టడంతో పాటు కూటమి పార్టీల నేతలతో సమన్వయం చేసుకుంటూ మంచి గుర్తింపు పొందారు. జనసేన, కూటమి పార్టీలకు రామస్వామినాయుడు చేసిన సేవలకు పార్టీ అధిష్టానం గుర్తించి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా సముచిత స్థానం కల్పించిందని పార్టీ కేడర్ హర్షం వ్యక్తం చేస్తోంది. కాగా తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి, జనసేన, కూటమిపార్టీలకు సేవ చేస్తానని రామస్వామినాయుడు అన్నారు. తనకు ఈ పదవి బాధ్యతలను అప్పగించిన సిఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, భీమిలి జనసేన ఇన్‌ఛార్జి డాక్టర్ సందీప్ పంచకర్ల, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఇతర ముఖ్యనేతలు, కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు.

గిరీశా చైతన్య స్కూల్‌లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



నృత్యాలు చేస్తున్న చిన్నారులు

ప్రజాశక్తి- విశాఖపట్నం : కంచరపాలెం గిరీశా చైతన్య స్కూల్‌లో హెచ్ఎం జె. అనురాధ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. జ్యోతిప్రజ్వళనతో కార్యక్రమాన్ని ప్రారంభించిన హెచ్ఎం మాట్లాడుతూ, ఎల్‌కెజి, యుకెజి, ఐదో తరగతి విద్యార్థులకు తరగతుల మారుతున్న కారణంగా గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందజేస్తున్నామన్నారు. పిల్లల చదువు, ఆరోగ్యంపట్ల తల్లిదండ్రుల బాధ్యతలపై అవగాహన కల్పించారు. గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా చిన్నారుల నృత్యాలు అలరించాయి. ఉపాధ్యాయులు నవీన్, వరలక్ష్మి, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

'సే నో టు డ్రగ్స్' ర్యాలీ

ప్రజాశక్తి- సీతమ్మధార : డాక్టర్ లంకపల్లి బుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాల, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కళాశాల నుంచి ఆశీలుమెట్ట జంక్షన్ వరకు శుక్రవారం 'సే నో టు డ్రగ్' ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డి.దీపక్‌చౌదరి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ బి.సతీష్ నాయుడు, ఎన్‌సిసి ఆఫీసర్ మేజర్ టి. బ్రహ్మానంద రెడ్డి, 50 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ ఛార్జీలపై దశలవారీ పోరాటం

బుక్ లెట్, పోస్టర్లు ఆవిష్కరించిన సిపిఎం నేతలు



అనకాపల్లిలో ఆవిష్కరిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు తదితరులు

ప్రజాశక్తి-అనకాపల్లి

విద్యుత్ స్మార్ట్ మీటర్లు, సెకీ ఒప్పందాలు, ట్రూ ఆఫ్ చార్జీలు పేరుతో ప్రజలపై మోపిన భారాలను రద్దు చేయాలని కోరుతూ ఏప్రిల్ మాసంలో ప్రజలను చైతన్యవంతం చేసి దశలవారీగా పోరాటాలు చేయనున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.శంకరరావు, గంటా శ్రీరామ్ తెలిపారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో శుక్రవారం ఇందుకు సంబంధించిన బుక్‌లెట్‌ను, పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం 10 నెలల కాలంలో విద్యుత్ ఛార్జీలు తగ్గించకపోగా రూ.15,485 కోట్లు అదనంగా సర్దుబాటు చార్జీల భారాన్ని ప్రజలపై వేసిందన్నారు. దీంతో పాటు ప్రతినెల యూనిటుకు అదనంగా 40 పైసలు చొప్పున సర్దుబాటు చార్జీలు వసూలు చేస్తున్నారని తెలిపారు. స్మార్ట్ మీటర్లు, విద్యుత్ సర్దుబాటు ఛార్జీలపై ఎన్నికలకు ముందు నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీలను గాలికొదిలేసి, గత వైసిపి ప్రభుత్వ విధానాలనే అమలు చేస్తున్నారని విమర్శించారు. ట్రాన్స్‌కో ద్వారా వచ్చిన మిగులు రూ.1000 కోట్లు ట్రూ డౌన్ చేసి విద్యుత్ టారిఫ్‌లు కూడా తగ్గించాలని డిమాండ్ చేశారు. అదానితో జరిగిన విద్యుత్ ఒప్పందాలను పలు రాష్ట్రాలు, దేశాలు తిరస్కరించి వెనక్కు పంపిస్తున్న నేపథ్యంలో అందుకు విరుద్ధంగా ఏపిఈఆర్సి ఆ ఒప్పందాలకు ఆమోదముద్ర వేయడం అవినీతికి ఆమోదం తెలపటమే అవుతుందన్నారు. సెకీతో జరిగిన ఒప్పందాల వల్ల వినియోగదారులపై అదనపు భారం పడుతుందన్నారు. వినియోగదారులు వాస్తవాలను గమనించి విద్యుత్ సర్దుబాటు చార్జీల భారాలపై ఆందోళనకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వి.వి.శ్రీనివాసరావు, అల్లు రాజు, బి.ఉమామహేశ్వరావు, నాయకులు నాగిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'స్మార్ట్‌మీటర్లు బిగించొద్దు' స్టిక్కర్ల ఆవిష్కరణ

ఆరిలోవ : ప్రజలపై విద్యుత్‌ఛార్జీల భారాన్ని మోపే స్మార్ట్‌మీటర్లను ప్రజలంతా వ్యతిరేకించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ పిలుపునిచ్చారు . శుక్రవారం ఆరిలోవ సుందరయ్య కాలనీ గ్రామ సంఘం సమావేశంలో 'మా ఇంటికి స్మార్ట్ మీటర్లు పెట్టొద్దు' స్టిక్కర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ విద్యుత్ ప్రయివేటీకరణలో భాగంగానే రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రీపెయిడ్ స్మార్ట్‌మీటర్లను ప్రజల నెత్తిన రుద్దాలని చూస్తోందని మండిపడ్డారు. ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వాలిచ్చే క్రాస్ సబ్సిడీలకు స్వస్తి చెప్పి, భారాలన్నీ ప్రజలపైనే మోపాలని చూడడం దారుణమన్నారు. స్మార్ట్ మీటర్ల బిగింపును ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు సమావేశంలో సిపిఎం నాయకులు వి నరేంద్ర కుమార్, కాలనీ నాయకులు అప్పలనాయుడు,రాజు, రమణ, సూర్యనారాయణ పాల్గొన్నారు.



ఆరిలోవలో స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న కుమార్, సిపిఎం నేతలు



పిహెచ్‌డి పట్టాను అందుకుంటున్న ఆదిరెడ్డి పరదేశినాయుడు

ఆదిరెడ్డికి చెన్నయ్ వర్సిటీ పిహెచ్‌డి ప్రదానం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని కాశీపురం గ్రామానికి చెందిన ఆదిరెడ్డి అక్కునాయుడు కుమారుడు ఆదిరెడ్డి పరదేశినాయుడుకు చెన్నైలోని భారత్ యూనివర్శిటీ వారు శుక్రవారం పిహెచ్‌డి డాక్టరేట్‌ను రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ గోవి చెజియాన్ చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఆదిరెడ్డి పరదేశి నాయుడు 18 సంవత్సరాలుగా అనంతపురంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో మైక్రోబయాలజీ అధ్యాపకుడిగా వైద్య విద్యార్థులకు బోధన చేస్తున్నారు. డెంగ్యూ వైరస్ పైన జరిపిన పరిశోధనలకు గాను ఆదిరెడ్డి పరదేశి నాయుడుకు డాక్టరేట్ డిగ్రీని ప్రదానం చేశారు. ఓ పక్క వైద్య విద్యార్థులకు మైక్రో బయాలజీ పాఠ్యాంశాలను బోధిస్తూ, మరోవైపు వారిని సమాజ సేవకులుగా తీర్చిదిద్దేందుకు ఎన్నో సేవా కార్యక్రమాలను చేసినందుకు 2019లో అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా జాతీయ స్థాయిలో ఉత్తమ జాతీయ సేవా పథక అధికారిగా అవార్డును అందుకున్నారు. గత సంవత్సరం ఆంధ్ర యూనివర్సిటీ నుంచి ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ మాస్టర్ డిగ్రీని కూడా ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత పొందారు. భారతదేశానికి ఉత్తమ వైద్య, నర్సింగ్, పారా మెడికల్ విద్యార్థులను అందించడమే తన లక్ష్యమని ఈ సందర్భంగా డాక్టర్ ఆదిరెడ్డి పరదేశి నాయుడు తెలిపారు.

పాఠశాలల ప్రహరీలకు రూ.21.2 కోట్లు మంజూరు



మాట్లాడుతున్న నరసింహారావు

ప్రజాశక్తి-దేవరాపల్లి : జిల్లాలోని 309 ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీల నిర్మాణానికి ఉపాధి హామీ ద్వారా 2024-25కు గాను రూ.21.2 కోట్లు మంజూరైనట్లు సర్వ శిక్ష అభియాన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.వి.నరసింహారావు తెలిపారు. శుక్రవారం దేవరాపల్లి వచ్చిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 2018-19లో ఎపి ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అండ్ కార్పొరేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో గతంలో దేవరాపల్లి, గొలుగొండ మండలం ఏఎల్ పురం, అచ్యుతాపురం మండలంలో ప్రభుత్వ వసతి భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపగా, ప్రస్తుతం దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో బాలికల వసతి గృహం నిర్మాణానికి రెండు కోట్ల ఐదు లక్షల రూపాయలు మంజూరైనట్లు చెప్పారు. కెమిస్ట్రీ ల్యాబ్‌లు మంజూరుకాగా ఒక్కొక్క ల్యాబ్ నిర్మాణానికి రూ. 15.58 లక్షలు వ్యయం అవుతుందని చెప్పారు. కెజిబివిలో అదనపు భవనం నిర్మాణానికి టెండర్లు పిలవడం జరిగిందన్నారు. నాడు-నేడులో రూ. 250 కోట్లతో 604 పాఠశాలలు మధ్యలో ఆగిపోయాయని, గత ప్రభుత్వంలో శాంక్షన్ రూ.131 కోట్లుతో ఖర్చు చేయడం జరిగిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం మనబడి-మన భవిష్యత్తు (2024-25)లో రూ.15.68 కోట్లు మంజూరు చేసి దశలవారీగా పూర్తి చేయాలని ఆదేశాలు వచ్చాయన్నారు.

విధుల్లో సమర్థత పెంపొందించుకోవాలి

విశాఖ రేంజ్ డిఐజి గోపినాథ్ జట్టి



రికార్డులు తనిఖీ చేస్తున్న విశాఖ రేంజ్ డిఐజి గోపినాథ్ జట్టి

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లా పోలీసులు తమ విధుల్లో మరింత సమర్థత, సమగ్రత పెంపొందించుకునేలా తగిన చర్యలు తీసుకోవాలని విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టి సూచించారు. అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హాతో కలిసి జిల్లా పోలీస్ కార్యాలయాన్ని వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం డిఐజి సందర్శించారు. జిల్లా క్రైమ్ రికార్డ్స్ బ్యూరో, స్పెషల్ బ్రాంచ్, పోలీస్ కంట్రోల్ రూమ్, జిల్లా పోలీస్ కార్యాలయ విభాగాల్లోని రికార్డులను సమీక్షించారు. పోలీస్ శాఖ నిర్వహిస్తున్న విధులను సమగ్రంగా పరిశీలించి, పనితీరును మెరుగుపరిచేందుకు అవసరమైన మార్గదర్శకాలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ శాఖ మరింత సమర్థవంతంగా పనిచేయడానికి అవసరమైన క్రమశిక్షణ, నూతన విధానాల అమలు వంటి అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంలో ఎస్పీ తుహిన్ సిన్హా, అదనపు ఎస్పీలు ఎం.దేవ ప్రసాద్, ఎల్.మోహనరావు, కార్యనిర్వాహక అధికారి ఏ.రామ్ కుమార్, ఇన్స్పెక్టర్లు లక్ష్మణమూర్తి, బాల సూర్యారావు, లక్ష్మీ, గఫూర్, రమేష్, రామకృష్ణారావు, పోలీసు అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మానవ సహాయం, విపత్తు ఉపశమనం శిక్షణకు స్నేహలత ఎంపిక



ప్రజాశక్తి-సబ్బవరం : సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ 3వ సంవత్సరం చదువుతున్న ఎన్‌సిసి నేవల్ విభాగం కేడట్ పండూరి స్నేహలత ఎయులోని అమెరికన్ సెంటర్‌లో అమెరికా ఇండియా మానవ సహాయ, విపత్తులు ఉపశమన హార్డ్ శిక్షణకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి సీతాలక్ష్మి తెలిపారు. శిక్షణ అమెరికన్ సేవాదళం, భారతీయ సేవాదళం వారి సంరక్షణలో, ఎన్సిసి క్యాడేట్స్‌కి మానవ సహాయం, విపత్తుల ఉపశమనం కొరకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. సబ్బవరం డిగ్రీ కళాశాల నుండి ఎంపిక కాబడిన పండూరి స్నేహలతకు ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, ఎన్‌సిసి డాక్టర్ బి.లక్ష్మి అభినందనలు తెలియజేశారు.

మోడల్ ప్రైమరీ స్కూల్లో పిల్లలను చేర్పించండి

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చెయ్యపేట మండలం వడ్డాది మెయిన్ ఎంపిపి పాఠశాలను మోడల్ ప్రైమరీ పాఠశాలగా ప్రభుత్వం మార్చిందని, ఇందులో పిల్లలను చేర్పించాలని పాఠశాల హెచ్ఎం టివి.శేషగిరిరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన తమ స్కూల్లో అడ్మిషన్లు గురించి గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఉపాధి హామీ పనులు జరుగుతున్న చెరువుల వద్దకు వెళ్లి ఉపాధి కూలీలకు అవగాహన కల్పించారు. పిల్లలను తమ స్కూల్లో చేర్పించాలని ప్రైవేటుకు మించి నాణ్యమైన విద్యను అందిస్తామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే విద్యా సంవత్సరం నుండి ఈ పాఠశాలలో ఎల్కేజీ, యూకేజీ అడ్మిషన్లు కల్పిస్తున్నట్లు చెప్పారు. అర్హత లేని ఉపాధ్యాయులతో ప్రైవేట్ పాఠశాల నడుపుతున్నారని, అర్హత ఉన్న ప్రభుత్వ పాఠశాలలో పిల్లలు సంఖ్య తగ్గిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. 2025-26 విద్యా సంవత్సరం నుండి ప్రభుత్వ పాఠశాలలో 3, 4, 5 సంవత్సరాల పిల్లలకు ఇంగ్లీష్ మీడియంతో కూడిన విద్యను ప్రభుత్వ పాఠశాలలోనే అందిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.



కూలీలతో మాట్లాడుతున్న హెచ్ఎం శేషగిరిరావు

బిసి సమరభేరి పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనకాపల్లి

బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 11న అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద జరుగు బిసి సమరభేరి నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జ్ సూదికొండ మాణిక్యాలరావు విజ్ఞప్తి చేశారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో శుక్రవారం జరిగిన బిసి సమరభేరి గోడపత్రికలను బిసి సంఘాల నేతలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాణిక్యాలరావు మాట్లాడుతూ బిసి వర్గాల ప్రజల రాజకీయ సామాజిక ఆర్థిక అభివృద్ధి సాధన కోసం బిసి కుల జన గణన జరిపి తీరాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సాధన సమితి కన్వీనర్ కోన లక్ష్మణ్, ప్రజా సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు బొట్టా చిన్నియాదవ్, గౌరవ అధ్యక్షులు బొడ్డేడ అప్పారావు, బిసి సంఘం జిల్లా నాయకులు వాయిబోయిన శేఖర్, బొబ్బిలి గోవింద, విత్తనాల పోతురాజు, మత్తుర్తి సూరిబాబు, సూదికొండ బాలరాజు, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి తహశీల్దారు రమేష్‌బాబు

ప్రజాశక్తి-కె.కోటపాడు : గ్రామంలో త్వరలో జరుగు రీ సర్వేను చౌడువాడ గ్రామ రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌ఛార్జి తహశీల్దారు రమేష్‌బాబు అన్నారు. మండలంలోని చౌడువాడ గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం రీ సర్వేపై గ్రామ ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చౌడువాడ గ్రామంలో 407 సర్వే నెంబర్లు ఉన్నాయని, వీటిని రీ సర్వే చేయుటకు రెండు టీములు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఒక్కొక్క టీమికి 8 మంది సర్వేయర్లు, ఒక విఆర్ఓ, ఒక విఆర్ఏ ఉంటారన్నారు. సర్వే జరిగేటప్పుడు ప్రతి రైతు తమ భూముహక్కు పత్రాన్ని చూపించాలన్నారు. రైతు బ్యాంకు బుక్కు, ఆధార్, ఫోన్ నెంబర్ జిరాక్స్ కాపీని అందజేయాలని కోరారు. సర్వేలో తప్పులు దొర్లితే వాటిని సరి చేయడం అంత సులువు కాదని, కాబట్టి రైతులు దగ్గర ఉండి తమ భూములను సర్వే చేయించుకోవాలని సూచించారు. చల్తా నెంబర్ ఇస్తారని, దానిని రైతులు అడిగి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఐ ఓఎస్.వెంకన్న, గ్రామ సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ ఏటుకూరు రాజేష్, సర్వేయర్, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎపిడి సంతోష్

అర్హులందరికీ బిసి రుణాలు

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : అర్హత కలిగిన బీసీలు అందరికీ ప్రభుత్వం కార్పొరేషన్ రుణాలు అందిస్తుందని ఏపిడి యల్లపు సంతోష్ అన్నారు. గుండాల జంక్షన్ వద్ద ప్రభుత్వ ఆడిటోరియంలో బ్యాంకర్లు, లబ్ధిదారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ అనకాపల్లి ఐదు డివిజన్లలో రుణాల కోసం 850 దరఖాస్తులు వచ్చాయని, వాటిలో అర్హులు 177 మందిని ఎంపిక చేసామని తెలిపారు. రుణాల పొందిన వారు స్వయం ఉపాధితో పాటు పలువురికి ఉపాధి కల్పించేలా కృషి చేయాలన్నారు. గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర మాట్లాడుతూ గతంలో రుణాలు పొంది బ్యాంకులకు చెల్లింపులు చేయని వారికి రుణాలు ప్రభుత్వం ఇవ్వదని స్పష్టం చేశారు. సమావేశంలో టిడిపి, జనసేన నాయకులు జోగి నాయుడు, ఆళ్ల రామచంద్రరావు, అప్పికొండ గణేష్, బుద్ద శ్రీనివాసరావు, బర్నికాన రాము, పలు బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

అధికారికంగా భగీరథ మహర్షి జయంతి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : వచ్చే నెల 4న భగీరథ మహర్షి జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేందుకు బీసీ వెల్ఫేర్ మంత్రి సవిత సానుకూలంగా స్పందించారని టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుర్రం నూకరాజు తెలిపారు. ఈ మేరకు అమరావతిలో శుక్రవారం మంత్రిని కలిసినట్లు చెప్పారు. రాష్ట్ర గౌడ హెల్పేర్ కార్పొరేషన్ చైర్మన్ వీరంక గురుమూర్తి, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు పూతి కోటేశ్వరరావుతో మంత్రిని కలిసినట్లు తెలిపారు. తామిచ్చిన వినతి పత్రంపై మంత్రి స్పందిస్తూ జీఓ రూపొందించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు. సానుకూలంగా స్పందించిన మంత్రి సవితకు రాష్ట్ర ఉప్పర సంఘం తరపున నూకరాజు కృతజ్ఞతలు తెలిపారు.

ప్లాస్టిక్ రహితంగా గ్రామాన్ని తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి-మునగపాక : మండలం వెంకటాపురం గ్రామాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలని మండల స్పెషల్ ఆఫీసర్ జి.ప్రభాకర్‌రావు పేర్కొన్నారు. వెంకటాపురం గ్రామ సచివాలయంలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ అనే కార్యక్రమంపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సాధించాలన్నారు. అనంతరం పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు స్వచ్ఛభారత్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుందరపు తాతాజీ, ఎంపీటీసీ మద్దాల వీరి నాయుడు, ఈవోపీఆర్‌డి సోమరాజు, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

14న అంబేద్కర్ జయంతిని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-మునగపాక : ఈనెల 14న స్థానిక బీచ్ బాయ్స్ ఆధ్వర్యంలో జరిగే డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 135వ జయంతిని జయప్రదం చేయాలని సర్పంచ్ దిమ్మల అప్పారావు పిలుపునిచ్చారు. స్థానిక అంబేద్కర్ కాలనీలో జయంతికి సంబంధించిన గోడ పత్రికను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఇచ్చిన రాజ్యాంగపు అవకాశం ద్వారా సర్పంచ్‌గా తాను ఎన్నికైనట్లు చెప్పారు. కార్యక్రమంలో పిఏసిఎస్ మాజీ చైర్మన్ కోనపల్లి రామ్మోహన్‌రావు, స్థానిక నాయకులు దిమ్మల నూకరాజు, రాజాన బుజ్జిబాబు, సిహెచ్.మురళి, తెరపల్లి భాస్కరరావు, కొత్తపల్లి సుర అనిల్, మాటూరి మహేష్, కణితి ఉమా, కొత్తపల్లి రామకృష్ణ, జంపా అరుణ్, మంత్రి శేఖర్, దిమ్మల సాయి, దొక్కా ప్రేమ్ కుమార్, బీచ్ బాయ్స్ కమిటీ ఆర్గనైజేషన్ పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సర్పంచ్, దళిత నాయకులు

ఉపాధి హామీ వేతన బకాయిలు చెల్లించాలి

సిఐటియు ఆధ్వర్యాన కూలీల నిరసన



పరవాడలో నినాదాలు చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

ప్రజాశక్తి - పరవాడ

ఉపాధి హామీ కూలీలకు బకాయి పడ్డ వేతనాలు చెల్లించాలని కోరుతూ మండల కేంద్రం పరవాడలోని పని ప్రదేశంలో సిఐటియు ఆధ్వర్యాన శుక్రవారం కూలీలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధి హామీని ప్రతిష్టంగా అమలు చేయాలని, కేంద్ర బడ్జెట్లో రూ.2 లక్షల కోట్లు కేటాయించాలని, ఏడాదికి కుటుంబానికి 200 రోజులు పని దినాలు కల్పించాలని, రోజు కూలి రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. చేసిన పనులకు మండలంలో రూ.2 కోట్ల మేరకు బిల్లులు చెల్లించకపోవడంతో కూలీలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత మూడు సంవత్సరాలుగా బడ్జెట్లో నిధులకు కోత విధించి మెటీరియల్ చార్జీలు పెంచేసారని, దీంతో ముందుగా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించి, తరువాత కూలీలకు చెల్లిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్వతి, ఆదిలక్ష్మి, అప్పారావు, అప్పల నరసమ్మ, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

కె.కోటపాడు : ఉపాధి హామీ కింద పనిచేస్తున్న కార్మికుల 9 వారాల బకాయిలు పెండింగ్లో ఉన్నాయని, వాటిని వెంటనే చెల్లించాలని సిపిఎం జిల్లా నాయకులు గండి నాయన బాబు, మండల నాయకులు వనము సూర్యనారాయణ డిమాండ్ చేశారు. మండలంలోని సూరెడ్డిపాలెం గ్రామంలో శుక్రవారం ఉపాధి కూలీలతో వారు మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్లో ఉపాధి హామీకి నిధులు లక్ష 25 కోట్ల రూపాయల నుంచి రూ.65 వేల కోట్లకు 2014-2024 మధ్యకాలంలో మోడీ ప్రభుత్వం తగ్గించి వేసిందని తెలిపారు. పనిచేసిన 15 రోజుల్లో పేమెంట్ ఇవ్వాలని చట్టంలో ఉన్నప్పటికీ ఆ విధంగా ఎక్కడ జరగలేదన్నారు. సమ్మర్ అలవెన్స్ 30శాతం, పనిముట్లు అలవెన్స్ ఇవ్వాలని, పని ప్రదేశంలో టెంట్లు, మెడికల్ కిట్లు, మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు సూరెడ్డి నారాయణమూర్తి, తాతిమ నాయుడు, కర్రి చంద్రుడు, పట్నాల ఈశ్వరరావు, వనము పైడుమ నాయుడు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిపిఎం నాయకులు సూర్యనారాయణ

రక్షణ గోడలు నిర్మించాలి

తెలుపు సున్నం వేసి నిరసన తెలిపిన సిపిఎం నేతలు

ప్రజాశక్తి-చోడవరం

చోడవరం-అనకాపల్లి రోడ్డులో కల్వర్టుల వద్ద ఎత్తుగా రక్షణ గోడలు నిర్మించాలని సిపిఎం నాయకులు వి.వి.శ్రీనివాసరావు, నాగిరెడ్డి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈ మార్గంలోని గూనూరు కళ్లల మదుం దగ్గర ఉన్న కల్వర్ట్ రక్షణ గోడకు తెలుపు సున్నం వేసి నిరసన తెలియజేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్వర్టుల వద్ద రక్షణ గోడలు ఎత్తుగా లేకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. ఇటీవలే ఇదే రోడ్డులో వెంకన్నపాలెం వద్ద రక్షణ గోడ లేని కల్వర్టు వద్ద ప్రమాదం జరిగి కాలువలో బైకర్లు పడి ఒక చిన్నారి, మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన విషయాన్ని గుర్తు చేశారు. ఇక్కడ వెంకన్నపాలెం గోవింద్ మాస్టర్లు 4 ఏళ్లుగా హెచ్చరిక బోర్డులు పెట్టి తన బాధ్యతను సేవ భావంతో నిర్వహిస్తున్నారని, ఈమాత్రం చిన్న పని కూడా చేయలేని స్థితిలో ప్రభుత్వం, అధికార్లు ఉండడం దారుణమన్నారు. సంక్రాంతి నాటికే శిథిలమైన రోడ్లన్నీ బాగుచేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం చోడవరం రోడ్డు ఇంత అధ్వానంగా వున్నా, కల్వర్టులకు గోడలు లేకపోయినా పట్టించుకోలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని లేనట్లయితే పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.


కల్వర్టు గోడకు తెల్ల సున్నం వేస్తున్న సిపిఎం నేతలు

రాములోరి పెళ్లికి ముహూర్తపు రాట

ప్రజాశక్తి-సబ్బవరం : శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో రాములవారి పెండ్లిరాట మహోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. సబ్బవరం, రావలమ్మపాలెం, బంగారమ్మపాలెం గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు దెడ్డం ప్రసాదరావు, సబ్బవరపు నారాయణమూర్తి, దాడి లావణ్య కన్నో నాయుడు ఆధ్వర్యంలో పెండ్లిరాటలు వేసారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సబ్బవరపు ముత్యాలనాయుడు, సబ్బవరపు దేముడుబాబు, దేంగేటి ప్రకాష్, దెంగేటి నాని, బర్ల రమణ, కొరాడ శ్రీనివాసరావు, నాని, బేతన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మధురవాడ : జివిఎంసి ఏడోవార్డు టైలర్స్ కాలనీ విజయ దుర్గాదేవి ఆలయ ప్రాంగణంలో శ్రీరామనవమి పురస్కరించుకొని రాములోరి పెళ్లికి శుక్రవారం ఐ ధర్మకర్త బంగారు లక్ష్మి, ధర్మకర్త మండలి సభ్యులు బంగారు ప్రకాష్, టెంటు మాధవి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శ్రీకాంత్ శర్మ ముహూర్తపు రాట వేశారు. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు బంగారు అశోక్‌కుమార్, ఝాన్సీ, వంకాయల సాయి కుమార్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.. వైసిపి నేత పోతిన శ్రీనివాసరావు, వంకాయల మారుతి ప్రసాద్ పాల్గొన్నారు.

పెందుర్తి : జివిఎంసి 97వ వార్డు చిన్నముషిడివాడ రైల్వే విహారి కాలనీలో సీతారాముల పెళ్లి రాట ఉత్సవం వైభవంగా నిర్వహించారు.కాలనీ అధ్యక్షుడు విస్సకోట రాము దంపతులు మొదటిపూజ చేశారు. 6న రాములోరి కల్యాణం అనంతరం అన్నసమారాధన ఉంటుందని తెలిపారు. కాలనీ ప్రతినిధులు పి .గోవిందరావు, కెవి ప్రసాదరావు, ఎంపి శ్రీనివాస్, ఎంవిఆర్ పాత్రుడు, ధర్మారావు, సదానందం, ఎంఎం శ్రీనివాస్, కృష్ణారావు పాల్గొన్నారు.

ఆరిలోవ : జివిఎంసి12వ వార్డు పెదగదిలి శ్రీకృష్ణ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో రాములోరి కళ్యాణ వేడుకకు పందిరి రాట వేశారు. గ్రామ అధ్యక్షులు కోలా బంగారయ్య, ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

పద్మనాభం : ఈనెల 6న, శ్రీరామనవమి సందర్భంగా రాములోరి కల్యాణానికి శుక్రవారం పలు గ్రామాల రామాలయాల వద్ద పెళ్లిరాట వేశారు. మద్ది గ్రామంలో ఎంపిపి కె..రాంబాబు, సర్పంచ్ బుగత సన్యాసమ్మ, సత్యనారాయణ పెద్దలు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి -చోడవరం రోడ్డు మరమ్మతులు చేసి ప్రజల ప్రాణాలు కాపాడాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం దర్జీ నగర్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పూర్తిగా గోతులమయం కావడంతో ఈ మార్గంలో నిరంతరం ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. కూటమి నేతలు తాము అధికారంలోకి రాగానే రోడ్లు మరమ్మతులు చేస్తామని చెప్పి సుమారుగా పది నెలల కాలం అవుతున్న నేటి కూడా రోడ్లు మరమ్మతు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. వెంటనే మరమ్మతులు చేయాలని లేని పక్షంలో కూటమి నాయకుల ఇంటి వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించినారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు, గొర్లె దేముడు బాబు, కుందూరి వీరచారి, కె బుజ్జి, జె మహేష్, నాగరాజు, నరాలశెట్టి సత్యనారాయణ, విత్తనాల పోతురాజు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఇల్లు మంజూరు చేయాలి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : హౌసింగ్‌శాఖ అధికారులు చేసిన పొరపాటును సరిదిద్ది తనకు ప్రభుత్వ గృహ నిర్మాణ స్కీం మంజూరు చేయాలని ఆర్.శివారాంపురంకు చెందిన గోకివాడ ఈశ్వరమ్మ విజ్ఞప్తి చేసింది. గతంలో తాను ఇంటి స్కీమ్ కోసం బుచ్చియ్యపేట అధికారులకు తన ఆధార్, రేషన్ కార్డుతో దరఖాస్తు సమర్పించానని, తన ఆధార్ కార్డుతో పెదపూడి గ్రామంలో ఇల్లు మంజూరైనట్లు ఆన్లైన్లో చూపిస్తుందని, కాని తన దరఖాస్తును అధికారులు తిరస్కరించారని తెలిపారు. ఇదే విషయమై గతంలో జిల్లా కలెక్టర్కు స్పందనలో కూడా ఫిర్యాదు చేశానన్నారు. తాను ఇప్పటివరకు ఎక్కడా ప్రభుత్వ గృహ నిర్మాణ స్కీము పొందలేదని, ఆన్లైన్లో పొరపాటు సరిచేసి తనకు ఇల్లు మంజూరు చేయాలని కోరుతున్నారు.

డైట్‌లో జగ్జీవన్ రామ్ జయంతి

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక డైట్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం బాబు జగ్జీవన్ రామ్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ ముఖ్య అతిథిగా హాజరై, విద్యార్థులకు బాబు జగ్జీవన్ రామ్ జీవిత చరిత్ర, ఆయన చేసిన సేవలను వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు మాట్లాడుతూ సమానత్వం, సామాజిక న్యాయం కోసం జగ్జీవన్‌రామ్ చేసిన పోరాటం ప్రతి విద్యార్థికి ప్రేరణగా నిలవాలని సూచించారు. ముందుగా జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కె. మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.


జగ్జీవన్ రామ్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

- జల జీవన్ కుళాయిల నుంచి సరఫరా కాని నీరు - ఖాళీ బిందెలతో మహిళల నిరసన

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని చందనాడ పంచాయతీ శివారు తమ్మయ్యపేటలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు, జిల్లా కమిటీ సభ్యులు ఎం.సత్యనారాయణ, మండల కార్యదర్శి ఎం.రాజేష్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ, గ్రామంలో ఇంటింటికీ జల జీవన్ మిషన్ పథకం ద్వారా కుళాయి కనెక్షన్లు ఇచ్చి నెలలు గడుస్తున్నా నేటికీ నీరు సరఫరా చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీధి కుళాయిలు పది, ఇరవై రోజులకు ఒక్కసారి మాత్రమే నీటి సరఫరా చేస్తున్నారని, అది కూడా పూర్తిస్థాయిలో సరఫరా చేయ లేదని, కుటుంబానికి రెండు, మూడు బిందెలు మాత్రమే అందుతుందని ఆవేదన వెలిబుచ్చారు. స్వంత బోర్ వెల్స్ ద్వారా ఉప్పు నీరు వస్తుందని, అవి తాగడానికి, వంట చేసుకోవడానికి ఏమాత్రం ఉపయోగంగా లేదన్నారు. వెంటనే అధికారులు స్పందించి తాగునీటి సమస్యలు పరిష్కరించాలని, ఇంటింటికీ జల జీవన్ మిషన్ పథకం ద్వారా సరఫరా చేయాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో ఆర్ పద్మ, ఎం.సిహెచ్.అమ్మాజీ, ఎం. ఈశ్వరమ్మ, ఆర్.శ్రీలక్ష్మి, సిహెచ్.వీరలక్ష్మి, ఎ.నాగమణి, కె.రోహిణిరాణి తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేపడుతున్న మహిళలు, నాయకులు

నిర్వాసితులకు రూ.25 లక్షల ప్యాకేజీ చెల్లించాలి

- మూలపర్రలో గ్రామసభ - ఆర్‌డిఒకు వినతి

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని అమలాపురం పంచాయతీ మూలపర్ర గ్రామంలో తుఫాన్ బిల్డింగ్ వద్ద శుక్రవారం నర్సీపట్నం ఆర్‌డిఓ వి.రమణ తహసీల్దార్ నరసింహ మూర్తితో కలిసి వైజాగ్- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ పై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డిఓ రమణ మాట్లాడుతూ, నిర్వాసితుల సమస్యలు త్వరితగతిన పరిష్కరించి, పరిశ్రమలు ఏర్పాటు చేయాలని భావిస్తున్నామన్నారు. నిర్వాసితులకు 2013 భూ సేకరణ ప్రకారం 2024 డిసెంబర్ 31 నాటికి 18 సంవత్సరాలు నిండి ప్యాకేజీకి అర్హులుగా మూలపర్ర గ్రామంలో 198 లబ్దిదారుల జాబితాను సిద్ధం చేశామన్నారు. ఒక్కొక్కరికి 8లక్షల 36 వేల రూపాయలు ప్యాకేజీ, పెదబోదుగల్లం రెవెన్యూ లో 5 సెంట్లు ఇంటి స్థలం ఇస్తామని తెలిపారు. ఇతర భూసమస్యలు పరిష్కారం చేస్తామని, గ్రామంలో గ్రామ కంఠం, రాస్తాలో ఉన్న ఇల్లులకు త్వరలోనే నష్టపరిహారం చెల్లిస్తామని వెల్లడించారు. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, గ్రామ ఉప సర్పంచ్ గంటా నర్సింగరావు, వైసిపి నాయకులు సూరకాసుల గోవిందరావు తదితరులు మాట్లాడుతూ నిర్వాసితులకు 25 లక్షల చొప్పున ప్యాకేజీ చెల్లించాలని కోరారు. ఇప్పటికే భూములు, ఇల్లులు కోల్పోయి తీవ్రంగా నష్టపోయిన వారికి న్యాయం చేయాలని కోరారు. పరిశ్రమలు, అభివృద్ధి కోసం భూములు, జీవితాలు త్యాగం చేసినప్పటికీ తమ సమస్యలకు పరిష్కారం చూపకుండా పరిశ్రమల ఏర్పాటుకు పనులు చేపడుతున్నారని, ఇది ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. సర్వం కోల్పోయిన తమను ఆదుకోవాలన్నారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని నిర్వాసితులు ఆర్డీవోకు అందజేశారు. ప్యాకేజీ చెల్లింపు విషయంపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తానని ఆర్డిఓ అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శంకర్రావు, సిపిఎం మండల కార్యదర్శి ఎం.రాజేష్, ఎస్.గోవిందరావు, వై.అప్పలరాజు, ఆర్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌డిఒకు వినతిపత్రాన్ని ఇస్తున్న నిర్వాసితులు, నాయకులు

7 నుంచి సంవత్సరాంత పరీక్షలు

ప్రజాశక్తి -రావికమతం: మండలంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో ఈనెల 7 నుంచి 17 వరకు సంవత్సరాంత పరీక్షలు నిర్వహించనున్నామని ఎంఈఓ తలుపులు తెలిపారు. శుక్రవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ, మండలంలో 71 పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి చదివే 2116 విద్యార్థులు 6 నుంచి తొమ్మిదవ తరగతి వరకు చదివే 3199 విద్యార్థులు ఈ పరీక్షల్లో పాల్గొననున్నారని ఆయన చెప్పారు. వీరికి సంబంధించిన పరీక్ష పేపర్లను అయ్యా పాఠశాలల స్కూల్ కాంప్లెక్స్‌లకు పంపుతున్నామని తెలిపారు. పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు నిర్ణీత సమయంలోపు పరీక్షల పేపర్ల ను పాఠశాలలకు తీసుకెళ్లాలని ఆదేశించారు.

ఉపాధి హామీ పనులు ప్రారంభం

ప్రజాశక్తి- రావికమతం :మండలంలో కన్నంపేట గ్రామంలో ఉపాధి హామీ పనులను గురువారం ప్రారంభించారు. గ్రామంలో సువర్ణపేట చెరువులో ఈ పనులను చేపట్టడం జరిగిందని గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ దంట్ల రాజేష్, నీటి సంఘం వైస్ ప్రెసిడెంట్ దంట్ల సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సొంత గ్రామంలోనే ఉపాధి హామీ పథకం ద్వారా పనులను కల్పించడం ఎంతో ఆనందదాయ కమన్నారు. ఈ పనిని ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఎండాకాలం దృష్ట్యా ఉదయం 6 గంటలకే పనిలోకి చేరుకొని ఎండ దెబ్బ తగలకుండా 11 గంటలకు ఇంటికి చేరుకునే విధంగా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం డైరెక్టర్ గేదె శ్రీరామ్ మూర్తి ,వార్డు మెంబరు పైలా కృష్ణ పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న నాయకులు

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలపై ప్రచారం

విద్యార్థుల తల్లిదండ్రులకు దరఖాస్తులు అందజేత

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని చందనాడ గ్రామంలో శుక్రవారం 2025-2026 విద్యా సంవత్సరానికి గాను స్థానిక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదుకు గ్రామ పెద్దలు, పాఠశాల విద్యా కమిటీ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అంగన్వాడీలు ప్రచారం చేపట్టారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రవేశ దరఖాస్తులను అందజేశారు. పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు ముందుకు వచ్చారు. గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలను మోడల్ ప్రైమరీ స్కూల్ గా మార్చాలని పాఠశాల విద్యా కమిటీ తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పుణ్యమంతుల బాబ్జి, కూటమి నాయకులు సత్తిబాబు, కర్రి బాబ్జి, ఎం.నారాయణ రావు, ఎం శ్రీను,నాయుడు, పెదకాపు, గోవిందు, రాజు తదితరులు పాల్గొన్నారు.



తల్లిదండ్రులకు దరఖాస్తులను అందిస్తున్న ఉపాధ్యాయులు

7న కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి -కోటవురట్ల:కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు ఈనెల 7న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు తెలిపారు, బీసీ, కాపు, బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, రెడ్డి, కులాల వెనకబడిన తరగతుల వారికి మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు బ్యాంక్ ప్రతినిధుల సమక్షంలో ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు తెలిపారు, వివిధ కులాలకు సంబంధించి 367 మంది దరఖాస్తులు అందాయన్నారు. దరఖాస్తుదారులు ఆన్లైన్లో చేసుకున్న దరఖాస్తులతో పాటు ఆధార్, రేషను, కుల, ఆదాయ ధ్రువ పత్రం తోపాటు వాహనాలకు దరఖాస్తు చేసుకున్న వారు డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకు రావాలన్నారు, 50శాతం సబ్సిడీతో అందజేసే రుణాలను అర్హులందరూ సద్వినియోగించుకోవాలని ఈ సందర్భంగా కోరారు.

ఉపాధి అవకాశాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-నక్కపల్లి:నిరుద్యోగ యువతీ యువకులు ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసికోవాలని తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ అన్నారు. దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన పథకం క్రింద గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న నిరుద్యోగ యువతీ యువకులకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నైపుణ్య అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా వివిధ రంగాల్లో ఉపాధి కల్పించడం కోసం శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. నిరుద్యోగులు క్యూఆర్ కోడ్ ద్వారా వివరాలు నమోదు చేసుకున్నట్లయితే నేరుగా సీడాప్ (నైపుణ్య అభివృద్ధి, ఉపాధి కల్పన సంస్థ) ఇంటర్వ్యూలో సెలెక్ట్ చేసిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. ఐటీ, ఆటోమేటివ్, లాజిస్టిక్స్, ఎలక్ట్రానిక్ హార్డ్ వేర్, టూరిజం అండ్ హాస్పిటాలిటీ క్యాపిటల్ గూడ్స్ మొదలగు రంగాల్లో శిక్షణ ఇచ్చిన తర్వాత నెలకు రూ 12000 నుండి రూ 18000 లు వరకూ జీతంతో ఉపాధి కల్పించడం జరుగుతుందన్నారు. ఈ నెల 8వ తేది నుండి పాయకరావుపేట నియోజకవర్గానికి సంబందించిన ఇంటర్వ్యూలు యలమంచిలి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరుగుతుతాయని, నిరుద్యోగులు ఈ అవకాశాన్ని అందుపుచ్చుకోవాలన్నారు.



చెత్త సేకరణను పరిశీలిస్తున్న డిపిఒ

చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:చెత్త రహిత గ్రామాలుగా తీర్చి దిద్దాలని జిల్లా పంచాయతీ అధికారి శిరీషా రాణి సూచించారు. నక్కపల్లిలో శుక్రవారం చేపట్టిన ఇంటింటా తడి పొడి చెత్త సేకరణను ఆమె పరిశీలించారు. చెత్త సేకరణ పై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రతి గ్రామంలోనూ ఇంటింటా తడి పొడి చెత్తను సేకరించి, సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌పిఒ మూర్తి, ఎంపీడీవోడీ సీతారామరాజు పాల్గొన్నారు.



దగ్ధమవుతున్న తోట

యూకలిప్టస్ తోట దగ్ధం

ప్రజాశక్తి -రావికమతం: మండలంలోని మరుపాక గ్రామంలో యూక లిప్టస్ తోట అగ్నికి ఆహుతి అయింది .గ్రామానికి చెందిన గొర్లె సత్తిబాబు, గొర్లె కన్నతల్లికి చెందిన సుమారు 80 సెంట్లు భూమిలో ఉన్న యుకలిప్టస్ తోట ప్రమాదవశాత్తు కాలి బూడిదయింది. ఈ విషయాన్ని తెలుసుకున్న రావికమతం అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. రైతు సేవ కేంద్రాలు ద్వారా ఇన్సూరెన్స్ క్లైమను అందించాలని రైతులు కోరుతున్నారు.



సూచనలు ఇస్తున్న ప్రత్యేక అధికారి

ఉపాధి హామీ కూలీలు జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని శుక్రవారం మండల ప్రత్యేక అధికారి పీ.ప్రసాద్ ఎంపీడీవో డి సీతారామరాజుతో కలిసి పలు గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేపట్టారు. ఉపమాక గ్రామంలో ఉపాధి పనులను పరిశీలించారు. వేసవి దృష్ట్యా కూలీలు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఉదయం 6 గంటలకు పని ప్రదేశాలకు వచ్చి కొలతలు ప్రకారం పని చేయాలని, రోజుకు 307 రూపాయలు వేతనం వచ్చే విధంగా పనిచేయాలన్నారు.చినదొడ్డిగల్లు లో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రం వద్ద పచ్చని మొక్కలు నాటి ఆహ్లాదరంగా ఉండే విధంగా తయారు చేయాలన్నారు. గ్రామాల్లో తడి పొడి చెత్త సేకరణ పై ప్రజలకు అవగాహన కల్పించాలలన్నారు. రాజయ్యపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి, మధ్యాహ్న భోజనం పథకాన్ని తనిఖీ చేశారు. సచివాలయాన్ని సందర్శించారు. వర్క్ ఫ్రం హెూం సర్వేను నూరు శాతం పూర్తి చేయాలని సచివాలయ ఉద్యోగులకు సూచించారు. సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. చెత్త సేకరణ పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లు వీసం నానాజీ, ఈశ్వరరావు, చిన దొడ్డుగల్లు సర్పంచ్ బొల్లం చంద్రరావు, ఇన్చార్జ్ ఈవోపీఆర్డీ ఎం శ్రీను, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారులు, కాంట్రాక్టర్

జల్ జీవన్ మిషన్ పనుల పరిశీలన

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని గొడిచెర్ల గ్రామంలో అసంపూర్తిగా నిలిచిన జలజీవన్ మిషన్ పనులను అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్ శుక్రవారం పరిశీలించినట్లు మాజీ వైస్ ఎంపీపీ, టిడిపి నేత వైబోయిన రమణ తెలిపారు. గ్రామంలో జల జీవన్ మిషన్ పనులు మూడు సంవత్సరాల నుండి జరుగుతున్నప్పటికీ, అసంపూర్తిగా ఉండడంతో గ్రామ ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని, ఈ మేరకు సమస్యను హెూం మంత్రి వంగలపూడి అనిత దృష్టికి తీసుకోవడంతో త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. ఈ మేరకు అధికారులు, కాంట్రాక్టర్ నిలిచిన పనులను పరిశీలించారని వారం రోజుల్లో పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

రోడ్డు పనుల్లో జాప్యం లేకుండా చర్యలు

ప్రజాశక్తి-చింతపల్లి : మండలంలోని తాజంగి రిజర్వాయర్ మీదుగా వెళుతున్న జాతీయ రహదారి నిర్మాణంలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. హైవే పనులకు అవసరమైన అడ్వాన్స్ పొజిషన్ (పూర్వ అనుమతి) ఇవ్వాలని రెవెన్యూ అధికారులను ఆయన సూచించారు. తాజంగిలో జాతీయ రహదారులు, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, రహదారి విస్తరణ పనులలో డెబ్రిస్ (మట్టి, రాళ్లు) తాజంగి రిజర్వాయర్ వద్ద వేయడంతో నీటి మట్టం తగ్గి, సాగుకు తీవ్ర అంతరాయం కలుగుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. వెంటనే డెబ్రిస్‌ను తొలగించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. హైవే నిర్మాణంతో రిజర్వాయర్ నీటి సామర్థ్యం ఏ విధంగానూ తగ్గ కూడదని కలెక్టర్ పేర్కొన్నారు. రిజర్వాయర్ అంచుల వెంబడి రివెట్‌మెంట్ (గట్టిని రక్షించే నిర్మాణం) చేపట్టాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

అవుట్ సోర్సింగ్ వర్కర్లను

ప్రయివేటు ఏజెన్సీలకు అప్పగించొద్దు

సిఐటియు ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: మున్సిపల్ ఔట్ సోర్సింగ్ వర్కర్లను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించరాదని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం నర్సీపట్నం పాత మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు మాట్లాడుతూ, ఆప్కాస్‌లో ఉన్న మున్సిపల్ శానిటేషన్, వాటర్ సప్లై ఇతర విబాగల ఔట్ సోర్సింగ్ వర్కర్లని ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించాలనే రాష్ట్ర ప్రభుత్వం ఆలోచనను తక్షణమే విరమించు కోవాలన్నారు. వీరిని పర్మినెంట్ చేయాలన్నారు. అనేక ఏళ్లుగా పర్మినెంట్ చేయాలని పోరాడితే వైసిపి ప్రభుత్వం ఆప్కాస్‌లో పెట్టిందని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించాలని చూస్తుందని విమర్శించారు. ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగిస్తే నెలనెలా జీతాలు చెల్లించకపోగా కార్మికలకు చెల్లించే జీతాలలో కోత విదిస్తారన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా చెల్లించని పరిస్థితి ఉంటుందన్నారు. కార్మికులపై వేధింపులు పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్, వాటర్ సప్లై నాయకులు కె.రాజు, వి.రమణ, అర్జనమ్మ, మహేష్, శేఖర్ పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న నాయకులు, కార్మికులు

వేతనాల్లో కోత విధించడంపై

అదానీ స్మార్ట్ మీటర్ ఉద్యోగుల ఆందోళన

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం టౌన్‌లో అదాని స్మార్ట్ మీటర్ ప్రాజెక్టులో పని చేస్తున్న ఉద్యోగులు శుక్రవారం రోడెక్కారు. తమకు వేతనాల్లో కోత విధించడంపై ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ, తమ జాయిన్ చేసుకునే ముందు ఆఫర్ లెటర్‌లో శాలరీ ఇన్స్టాలర్‌కు రూ.33వేలు, హెల్పర్‌కు రూ.2వేలు ఇస్తామని చెప్పారన్నారు. 8 నెలలుగా పని చేయించుకుని, ఇప్పుడు ఉద్యోగులకు జీతాలను సగానికి పైగా తగ్గించిందన్నారు. అడిగిన వారికి టెర్మినేషన్ లెటర్ పంపిస్తున్నారని చెప్పారు. ఎవరైతే నిరసన తెలుపుతారో వారిని ఉద్యోగాల నుంచి తీసేస్తామని బెదిరిస్తున్నారని తెలిపారు.తమ శాలరీని ఆఫర్ లెటర్ లో ఉన్న విధంగా పాత విధానంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు.



ఆందోళన చేపడుతున్న ఉద్యోగులు

గ్రామాల అభివృద్ధికి కృషి చేయండి

ప్రజాశక్తి -అనంతగిరి: మారుమూల గిరిజన గ్రామంలో నెలకొన్న మౌలిక వసతి సమస్యలు పరిష్కరించడంలో సచివాలయం సిబ్బంది కీలక పాత్ర పోషించాలని అల్లూరి సీతా రామరాజు జిల్లా పంచాయతీ అభివృద్ధి అధికారి లవరాజు ఆదేశించారు. శుక్రవారం మండలంలోని టోకురు పంచాయితీ సచివాలయంలో సందర్శించారు. అనంతరం సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో అన్ని పంచాయతీ సచివాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది మారుమూల గిరిజన గ్రామాల అభివృద్ధికి కృషి చేయవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కిల్లో. మొస్య, ఎంపీడీవో ఏ వివి. కుమార్, పంచాయతీ విస్తరణ అధికారి పి ధర్మ, సెక్రటరీ శైలజ పాల్గొన్నారు.



ధర్నా చేపడుతున్న నాయకులు

ప్రసాద్ గార్డెన్స్‌లో..
పేదల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలి

-సిపిఎం ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: దక్షిణ నియోజవర్గం 35 వ వార్డు పరిధిలోని ప్రసాద్ గార్డె లో నివసిస్తున్న పేదల ఇళ్ల స్థలాల సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం చౌల్ట్రీలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట సిపిఎం జగదాంబ జోన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించి, తసిల్దార్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జగదాంబ జోన్ కన్వీనర్ ఎం.సుబ్బారావు,శ్రీ దుర్గ మాంబా యోజన సంఘం నాయకులు సిమ్మ అప్పారావు మాట్లాడుతూ, ఎన్నో సంవత్సరాలుగా ప్రసాద్ గార్డెన్స్‌లోనే తామంతా నివాసం ఉంటూ, ఇళ్ల పట్టాల కోసం ఎదురు చూస్తున్నప్పటికీ ఎటువంటి న్యాయం జరగలేదన్నారు. గత ప్రభుత్వం అన్యాయం చేసిందని, కూటమి ప్రభుత్వాన్ని గెలిపిస్తే అధికారంలోకి వచ్చి పది నెలలు గడిచినా, ఇళ్ల స్థలాల గురించి పట్టించుకోలేదన్నారు. ఎమ్మెల్యే, ఎంపిలు ఎవరిని కలిసినా, ఇదిగో ఇస్తాం అదిగో ఇస్తాం అంటున్నారు తప్ప ఖచ్చితమైన హామీ ఎవరూ ఇవ్వలేదన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించకపోతే బాధితులు అందరం ఎమ్మెల్యే, ఎంపి ఇళ్ళ ముందు కూడా ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ పోరాటానికి కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నాయకులు ఎం.సుబ్బన్న, వై.రాజు, చిరంజీవి, తదితరులు మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బంగారు రావు, బాబ్జి, బాబురావు, శ్రీనివాసరావు, దుర్గారావు, సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

13న విశాఖలో రాజ్యాంగ పరిరక్షణ సమ్మేళనం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం, ప్రజానాట్య మండలి విశాఖ జిల్లా కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 13న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 134వ జయంతోత్సవాలు, రాజ్యాంగ పరిరక్షణ సమ్మేళనం పేరుతో అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు మద్దెల సుబ్బన్న, ప్రజానాట్య మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చంటి తెలిపారు. శుక్రవారం జగదాంబ సిఐటియు జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, రాజ్యాంగ పరిరక్షణ కోసం అంబేద్కర్ ఆశయాలు ప్రజల్లోకి తీసుకు వెళ్లడం కోసం, సాంఘిక సమానత్వం సాధించడం కోసం ఈ రాజ్యాంగ పరిరక్షణ సమ్మేళనం పేరుతో సాంస్కృతిక కళా ప్రదర్శనలు, పాటలు, డాన్సులు, నాటికలు డప్పులు, తీన్మార్ లు, కోలాటాలు, పలు కళా రూపాలతో ఈ నెల 13న ఉదయం 9 గంటలకు ఎల్ఐసి దరి అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం వరకు డప్పుల కళాకారులతో ర్యాలీ జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమానికి సినీ నటులు,నిర్మాత పీపుల్ స్టార్ ఆర్.నారాయణ మూర్తి ముఖ్య అతిథిగా పాల్గొంటున్నారన్నారు. ఈ నెల 5న బాబు జగజీవన్ రామ్ జయంతోత్సవాలు నగరవ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 11 న జ్యోతిరావు పూలే జయంతోత్సవాలు, 12 న హష్మీ జయంతోత్సవాలు, 13న డప్పుల కళాకారుల ర్యాలీ, రాజ్యాంగ పరిరక్షణకై అల్లూరి విజ్ఞాన కేంద్రంలో పూర్తి రోజు కళారూపాలు ప్రదర్శనలు ఉంటాయన్నారు. 14న నగరంలో అంబేద్కర్ విగ్రహాలకి నివాళులర్పించడం జరుగుతుందని తెలిపారు.ఈ మీడియా సమావేశంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వై.రాజు, విశాఖ నగర అధ్యక్షులు టి.చిరంజీవి, ఎం.వి ప్రసాదరావు, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షులు జి.రమణ, ఎన్ఎఎన్ మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

సేంద్రీయ సాగుపై అవగాహన

ప్రజాశక్తి-చింతపల్లి : అల్లూరి సీతారామరాజు జిల్లాను 2026-27 నాటికి పర్యావరణ హిత వ్యవసాయ మోడల్ జిల్లా(సేంద్రీయ జిల్లా)గా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పని చేయాలని డివిజనల్ సహాయ వ్యవసాయ సంచాలకురాలు జాహ్నవి సూచించారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో, రైతు సాధికారత సంస్థ, ఏపీ సీఎన్ఎఫ్, వెలుగు అధికారులతో సేంద్రీయ వ్యవసాయ ప్రణాళికపై సమీక్ష సమావేశంను నిర్వహించారు. ఈ సమావేశానికి మండల అభివృద్ధి అధికారి యు శ్రీనివాస్, వ్యవసాయ అధికారి శ్రీనివాస్, వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాసులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, అన్నిశాఖల అధికారులు వ్యవసాయాన్ని పర్యావరణ హితంగా మార్చేలా రైతులకు అవగాహన కల్పించేందుకు సమిష్టిగా పని చేయాలని సూచించారు. రైతులు సేంద్రీయ వ్యవసాయం వైపు ఆకర్షితులయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.